నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 5-11-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:82 పేజీలు:68 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

వెయ్యి రోజులు
తీర్చారు జనం గోస
అప్పుల కుప్ప.

అక్టోబర్ నెల
తీవ్ర వేడిగాలులు
వానలు నిల్లు.

ఖాళీ పురైలు
అక్షరాలు నింపాలి
జ్ఞాన విప్లవం.

కరువు కోర
ఎండిన పంటపైరు
ధరల జోరు.

మత్తు గుప్పిలి
నేటి యువత బలి
చిత్తు చేయాలి.

- రేడియమ్
సెల్: 9291527757

శ్లోకము

ఎల్ నినో సాకు చెబుతూ
వెతికిందే వెతుకు !
ఆంక్షలెన్ని ఉంటె ఏమి
కాంక్ష లేని బతుకు !
దొరుకుతుంది ఏదైనా
మనసు ఉంటే తోవ
పిచ్చివాని కేమి తెలుసు
మధురమైన కోవ ?

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

ఓటర్ల జాబితాలో పేరులేని వారు ఫాం 6 ద్వారా అప్లై చేసుకోవచ్చు: ఈసీ



న్యూఢిల్లీ, నవంబర్ 4: ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ తర్వాత పబ్లిష్ అయిన ఓటరు జాబితాలో పేరు కోల్పోయిన వారు ఫాం 6 ద్వారా కొత్తగా అప్లై చేసుకోవచ్చని ఎన్నికల సంఘం (ఈసీ)తెలిపింది. అలాంటి వారు అంతకుముందు ఓటర్లుగా నమోదై ఉన్నా కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని ఈసీ స్పష్టం చేసింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఈనెల 3న లేఖ రాసింది. ఫాం 6 ద్వారా కొత్తగా అప్లై చేసినా.. చట్టపరంగా ఎలాంటి చర్యలు తీసుకోబోమని, అలా దరఖాస్తు చేసినంతమాత్రాన తప్పుడు డిక్లరేషన్ ఇచ్చినట్లు కాదని ఈసీ వివరించింది. కాగా.. కొత్తగా విడుదల చేసిన ఓటరు జాబితాలో పలువురు ఓటర్ల పేర్లు గల్లంతయ్యాయి. దీంతో అలాంటి వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి సందేహిస్తున్నారు. ఫాం 6 ద్వారా అప్లై చేస్తే తమను ఓటరు జాబితాలో మొదటిసారిగా చేరుస్తారన్న సందేహం వారిలో నెలకొంది. ఈ నేపథ్యంలో ఈసీ క్లారిటీ ఇచ్చింది.

ఓటరు జాబితాలో పేరులేని వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిందేనని, ఇలా చేయడం వల్ల ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోబోమని, వారు పాత ఓటర్లు అయి ఉన్నా కూడా ఇబ్బందులు ఉండవని ఈసీ స్పష్టం చేసింది. సెక్షన్ 31 కింద ఎలాంటి చర్యలు తీసుకోరాదని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అయితే, దరఖాస్తుదారులు మరో పార్లమెంటరీ నియోజకవర్గంలోగానీ, అసెంబ్లీ నియోజకవర్గంలో గానీ ఓటరుగా నమోదై ఉండకూడదని ఈసీ తెలిపింది. కాగా.. సర్ ప్రక్రియ తర్వాత విడుదల చేసిన ఓటర్ల జాబితాలో చాలా మంది ఓటర్ల పేర్లు గల్లంతయ్యాయని భారీగా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఈసీ ఈ మేరకు ఒక క్లారిటీ ఇచ్చింది.

తెలంగాణ ప్రగతిలో యాదవుల భాగస్వామ్యం అవసరం: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 4 (నేటినిజం ప్రతినిధి): యాదవులు కొరగానే తమ ప్రభుత్వం సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానిం చారు. ఇది యాదవులకే కాదని.. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికి ఆత్మగౌరవ సమ్మేళనమని పేర్కొన్నారు.

యాదవ సోదరులందరికీ సదర్ సమ్మేళన శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో ఈరోజు (బుధవారం) హైదరాబాద్ బొఖీ స్టేడియంలో శ్రీకృష్ణ సదర్ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. యాదవ సోదరుల ఆత్మగౌరవానికి ఎక్కడా లోటు లేకుండా చూసే బా

దేశంలో తెలంగాణను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా నిలబెట్టాలనేదే తమ ప్రయత్నమని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. మూసీ అభివృద్ధి, మెట్రో విస్తరణ, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని.. ఇందుకు యాదవ సోదరుల సహకారం ఉండాలని కోరారు. హైదరాబాద్ నగరంలో ఇప్పటి గోల్కొండ కోట ఒకనాటి గొల్లంకొండ అని ప్రస్తావించారు. యాదవ సోదరుల సహకారంతోనే హైదరాబాద్ నగరం ఇంతగా అభివృద్ధి చెందిందని అన్నారు. దేశంలో వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన వారిని యాదవ సోదరులు ఆదరించి అక్కున చేర్చుకున్నారని చెప్పుకొచ్చారు. గతంలో ఏ ముఖ్యమంత్రి సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించాలనే ఆలోచన చేయలేదని పేర్కొన్నారు.

సదర్ సమ్మేళనం నిర్వహణకు తమ ప్రభుత్వంలో రూ.5 కోట్లు మంజూరు చేశామని ముఖ్యమంత్రి వెల్లడించారు. తెలంగాణలో తాము కులగణన చేసి చూపించామని ఉద్ఘాటించారు.

రాష్ట్ర మోడల్‌ను దేశం అనుసరించేలా కులగణన నిర్వహించామని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వంలో యాదవులకు సముచిత స్థానం కల్పించామని వెల్లడించారు. అనిల్ కుమార్ యాదవ్‌ను రాజ్యసభ సభ్యుడిగా, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించామని తెలిపారు.

ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట బోర్డు సభ్యురాలిగా నియమించామని ప్రస్తావించారు. యాదగిరి గుట్ట గోశాలలో గోసంరక్షణ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. రాబోయే యాదవులకు దక్కాల్సిన వాటా వారికి దక్కేలా చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

తెలంగాణను గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం: భట్టి విక్రమార్క



హైదరాబాద్, నవంబర్ 4 (నేటినిజం ప్రతినిధి): తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో డీప్‌టెక్, సాంకేతిక ఆవిష్కరణలు కీలక పాత్ర పోషించాలని సూచించారు.

ఈరోజు (బుధవారం) బేగంపేట ఐటీసీ కాకతీయ హోటల్లో FICCI @100 వేడుకలు, తెలంగాణ డీప్‌టెక్ లీడర్‌షిప్ సమ్మిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భట్టి విక్రమార్క హాజరై, మాట్లాడారు. పరిశోధనలు ప్రయోగశాలలకే పరిమితం కాకుండా ప్రజలకు ఉపయోగపడే ఉత్పత్తులుగా మారాలని మార్గనిర్దేశం చేశారు.

డీప్‌టెక్ అభివృద్ధికి హైదరాబాద్‌లో అపారమైన అవకాశాలు ఉన్నాయని భట్టి విక్రమార్క వెల్లడించారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, బయోటెక్, ఏరోస్పేస్ రంగాల సమన్వయంతో ముందడుగు వేస్తున్నామని తెలిపారు. పరిశ్రమలు, పరిశోధకులు, ప్రభుత్వ శాఖల సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

యువ స్టార్టప్‌లకు ఉమ్మడి పరీక్షా కేంద్రాలు, సులభతర ధ్రువీకరణ విధానాలు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. కొత్త ఆవిష్కరణలకు ప్రభుత్వం, పరిశ్రమలు అండగా నిలవాలని అన్నారు. విజయవంతమైన ప్రయోగాలను విస్తృతంగా అమలు చేయాలని సూచించారు. పునరుత్పాదక విద్యుత్ వినియోగం, విద్యుత్ నిల్వ, స్మార్ట్ గ్రిడ్ వ్యవస్థల్లో సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహించాలని చెప్పుకొచ్చారు.

వైద్య రంగంలో వ్యాధులను ముందుగానే గుర్తించే ఆధునిక సాంకేతిక పరికరాలు అందుబాటులోకి రావాలని భట్టి విక్రమార్క అభిలాషించారు. రైతులకు తక్కువ ఖర్చుతో ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. సాంకేతిక ఉత్పత్తుల రూపకల్పన దశ నుంచే సామాన్యులకు అందుబాటులోని ధరలను దృష్టిలో పెట్టుకోవాలని పేర్కొన్నారు. డీప్‌టెక్ రంగం ద్వారా యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించాలని చెప్పారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఉత్పాదకత పెంపునకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగపడాలని సూచించారు.

ఆవిష్కరణల ఫలితాలు ప్రజల ఆదాయాల పెరుగుదల, మెరుగైన ప్రభుత్వ సేవలు, ఉపాధి అవకాశాల రూపంలో కనిపించాలని పేర్కొన్నారు. భారతీయ ఆలోచనలు, ఆవిష్కరణలు ప్రపంచస్థాయి పారిశ్రామిక సంస్థలుగా ఎదగాలని భట్టి విక్రమార్క ఆకాంక్షించారు.

హిందూ కాలేజీ విద్యార్థుల ఆందోళనకు కవిత మద్దతు



న్యూఢిల్లీ, నవంబర్ 4: ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని హిందూ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన నిరసనకు తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత మద్దతు తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆమె కాలేజీకి వెళ్లి ఆందోళన చేస్తున్న విద్యార్థులను కలిశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కాలేజీని ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

హిందూ కాలేజీ ప్రైవేటీకరణ ప్రయత్నాలు, ప్రవేశ ప్రక్రియలో చోటుచేసుకున్నాయని విద్యార్థులు ఆరోపిస్తున్న అవకతవకలకు వ్యతిరేకంగా విద్యార్థులు, అధ్యాపకులు గత నెలన్నర రోజులుగా ఆందోళన చేస్తున్నారని కవిత పేర్కొన్నారు. ఇంతకాలంగా నిరసనలు కొనసాగుతున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

హిందూ కాలేజీని ప్రైవేటు వ్యక్తులు లేదా సంస్థల చేతుల్లో పెట్టకూడదని కవిత స్పష్టం చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యాసంస్థల విషయంలో విద్యార్థులు, అధ్యాపకుల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

యూజీసీ నిబంధనల ప్రకారం ప్రైవేటు సంస్థలు విరాళాలు అందిస్తే, వాటి సహకారంతో కళాశాలలకు పరిమిత స్థాయిలో సౌకర్యాలు కల్పించవచ్చని కవిత పేర్కొన్నారు. దేశ వనరులను ఉపయోగించుకుంటున్న సంస్థలు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద విద్యా సంస్థల అభివృద్ధికి సహకరించడం మంచిదేనన్నారు. అయితే అలాంటి సహకారం పేరుతో కళాశాలలపై ప్రైవేటు సంస్థల ఆధిపత్యం పెరగకూడదని అభిప్రాయపడ్డారు.హిందూ కాలేజీకి వచ్చినప్పుడు రిలాక్సో కాలేజీకి వచ్చినట్లుగా అనిపిస్తోందని కవిత వ్యాఖ్యానించారు. కాలేజీ ప్రస్తుత పరిస్థితిపై ఆమె తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సమస్య పరిష్కారం కోసం విద్యార్థులు, అధ్యాపకులు కలిసి ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. హిందూ కాలేజీ విద్యార్థుల పోరాటానికి తెలంగాణ రక్షణ సేన అండగా ఉంటుందని కవిత హామీ ఇచ్చారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణకు తమ మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఉపాధి కల్పన.. జల సంరక్షణ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

గ్రామీణ మౌలిక వసతుల నిర్మాణాల పురోగతిని నిరంతరం పరిశీలించాలి
పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ ఐఏఎస్



ములుగు, నవంబర్ 4:(నేటినిజం ప్రతినిధి): గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన, జల సంరక్షణ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ ఐఏఎస్ సూచించారు. గ్రామీణ మౌలిక వసతుల నిర్మాణాల పురోగతిని నిరంతరం పరిశీలించాలని పేర్కొన్నారు.

బుధవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఉపాధి పనులు, కూలీల హాజరు, జాబ్‌కార్డుల జారీ, మేట్ల శిక్షణ, జలసిరి పనులు, గ్రామీణ మౌలిక వసతుల నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు ఈ సమావేశానికి హాజరయ్యారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నవంబర్ 3 నాటి నివేదిక ప్రకారం రాష్ట్రంలోని 12,760 గ్రామ పంచాయతీలకుగాను 12,280 పంచాయతీల్లో ఉపాధి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఆ రోజు రాష్ట్రవ్యాప్తంగా 5,02,697 మంది కూలీలు పనులకు హాజరయ్యారని పేర్కొన్నారు. ఇంకా పనులు ప్రారంభించని పంచాయతీలపై దృష్టి సారించి, ఉపాధి కోరే కూలీలకు పనులు అందుబాటులో ఉంచాలని సూచించారు. జాబ్‌కార్డుల జారీకి సంబంధించిన పెండింగ్ అంశాలను పరిష్కరించాలని, కూలీల హాజరు, పనిదినాల నమోదును పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు.

జలసిరి కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 55,133 పనులు ప్రారంభించి, 14,121 పనులు పూర్తి చేసినట్లు కమిషనర్ తెలిపారు. వ్యవసాయ కుంటలు, ఊటకుంటలు, ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాల పూర్తిపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. పశుగ్రాస సాగు, పశువుల తాగునీటి తొట్టెల నిర్మాణానికి ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు. గ్రామీణ మౌలిక వసతుల నిర్మాణాలను నిర్దేశిత గడువులోగా సిద్ధం చేసేలా పురోగతిని పర్యవేక్షించాలని తెలిపారు.

ములుగు జిల్లాలో 171 గ్రామ పంచాయతీలకుగాను 162 పంచాయతీల్లో ఉపాధి పనులు ప్రారంభించామని, నవంబర్ 3న 7,465 మంది కూలీలు పనులకు హాజరయ్యారని జిల్లా అదనపు కలెక్టర్ ఎం. సంపత్ రావు కమిషనర్‌కు వివరించారు. పనులు ప్రారంభమైన పంచాయతీల్లో కూలీల సగటు హాజరు 46గా నమోదై, రాష్ట్ర సగటు 41 కంటే మెరుగ్గా ఉండటంపై కమిషనర్ జిల్లా అధికారులను అభినందించారు. జిల్లాలో ప్రారంభించిన వ్యవసాయ కుంటల పనులతోపాటు నవంబర్ 19 నాటికి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాల్సిన 254 నిర్మాణాల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ రవీందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీ కాకులమర్రి లక్ష్మణ్ బాబు మరియు ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ శ్రీమతి కాకులమర్రి శ్రీలత వారి నివాసంలో పెళ్లి కొడుకు అమంచ కన్నయ్య స్వయంగా కలసి తన వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లంపల్లి మండల అధ్యక్షులు పాలప్ శ్రీనివాస్ సురేష్ మల్లంపల్లి మాజీ సర్పంచ్ రాజేశ్వర్ మరియు ఇతర ముఖ్య నాయకులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

యువత లక్ష్య సాధనకు ప్రభుత్వం అండగా ఉంటుంది - మంత్రి సీతక్క



ములుగు, నవంబర్ 4:(నేటినిజం ప్రతినిధి): ములుగు జిల్లా కేంద్రంలో పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాల కోసం నిరుద్యోగ యువతకు అందిస్తున్న శిక్షణా తరగతులను గౌరవ రాష్ట్ర మంత్రివర్యులు శ్రీమతి ధనసరి అనసూయ సీతక్క గారు పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో మంత్రి నేరుగా మాట్లాడి, వారి చదువు, శిక్షణా విధానం, వసతి సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం శిక్షణార్థులతో కలిసి సాధారణంగా భోజన క్యూ లైన్‌లో నిలబడి భోజనం చేశారు.

అభ్యర్థులతో కలిసిమెలిసి వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా వారికి భరోసా కల్పించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకొని కష్టపడి చదవాలని, ఎక్కువ మంది అభ్యర్థులు ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించి పోలీస్ ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు.

గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షల్లో మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, అభ్యర్థుల విజయానికి అవసరమైన సహకారం అందిస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ ఆఅఆ అధ్యక్షులు పైడాకుల అశోక్ , డీఎస్పీ రవీందర్ , ఆర్.ఐ, సీఐ, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు

చురక

నేరాలకు ఘోరాలకు
నెలవైనా దేశ యువత
కారణాలు ఏవైనా
కాలుతుంది నేడు భవిత
సినీమాలు సీరియళ్లు
చెడును పెంచే డ్రగ్స్ మత్తు
నియంత్రించే వాళ్లంతా
నిదురించిన ఈ విపత్తు



-వేల్పుల నారాయణ
9440433475

రాధశ్రీ రాగాలు

తెలియవలె వేదమ్ము
తొలగవలె వాదమ్ము
పొందవలె మోదమ్ము
ననును రాధశ్రీ !!
పద్యాల కావ్యమ్ము
పాండవోద్యోగమ్ము
కూర్చు సంతోషమ్ము
ననును రాధశ్రీ !!



-రాధశ్రీ
సెల్:9494481210



ఒక సాగరంతో మరో మహాసాగర కరచాలనం


కథకుడిగా, కవిగా, రచయితగా, వ్యాసకర్తగా, చరిత్రకారుడిగా, జర్నలిస్టుగా, పత్రికా సంపాదకుడిగా ఈతకోట సుబ్బారావు సుప్రసిద్ధులు. ఈయన కవిత్వంలో వస్తువైవిధ్యం, భావగాఢత, సామాజిక స్పృహ, భాషా సౌందర్యం కొలతలకు అందని ఎత్తుల్లో కొనసాగడం అతిసాధారణంగా జరుగుతున్న ప్రక్రియ. ఆధునిక తెలుగు సాహిత్య రంగంలో ముఖ్యంగా అభ్యుదయ కవితా ఉద్యమంలో ఆవంత్స సోమసుందర్ గారిది అత్యంత విశిష్టమైన స్థానం. కవిగా, విమర్శకుడిగా, రచయితగా, అనువాదకుడిగా ఆయన చేసిన సాహిత్య సేవ అనన్యసామాన్యం. ఈతకోట సుబ్బారావు గారి కవిత్వంలోని అంతస్సారాన్ని, ఆయన కవితా ప్రయోగాల్లోని ప్రత్యేకతలను, పదాల వెనక దాగివున్న భావగాంభీర్యాన్ని డాక్టర్ ఆవంత్స సోమసుందర్ గారు తమ వ్యాఖ్యానం ద్వారా ఆవిష్కరించిన పుస్తకమే 'పినాకినీ తీరంలో...కవితా ఘలంఘలు'. ఈ పుస్తకంలో ఒకరి కవిత్వంపై మరొకరు చేసిన సాధారణ అభిప్రాయాలు ఇందులో కనిపించవు. ఒకప్పుడు అమృతం కురిసిన రాత్రిని చూశాం. ఇప్పుడు అమృతం కురిసిన పేజీలను ఈ పుస్తకంలో చూస్తున్నాం. ఒక కవి రాసిన కవిత్వాన్ని మరొక సాహితీవేత్త తన అపార అనుభవంతో, అధ్యయనంతో, విమర్శనాత్మక దృష్టితో సమాలోచనం చేసి, ఆ కవిత్వాన్ని పాఠకులకు మరింత చేరువయ్యేలా చేసిన గ్రంథం ఇది.

కవిత్వాన్ని చదవడం ఒక స్థాయి అయితే, అందులోని అంతరార్థాలను గుర్తించి పాఠకుడికి వివరించడం మరో స్థాయి. కవితలోని పదప్రయోగాలు, ప్రతీకలు, ఉపమానాలు, ధ్వనులు, భావచ్ఛాయలను విశ్లేషిస్తూ కవి ఉద్దేశ్యాన్ని డా. ఆవంత్స సోమసుందర్ గారు గొప్ప ఆశీర్వాదంతో కూడిన వ్యాఖ్యానం చేశారు. కవి ఎంచుకున్న పదాలు సాధారణమైనవిగా కనిపించినప్పటికీ, సందర్భాన్నిబట్టి అవి అసాధారణమైన భావాలను ఎలా పలికించాయో తన వ్యాఖ్యానంతో వాటిని సరికొత్తగా పరిచయం చేశారు. ఈతకోట సుబ్బారావు గారు ప్రయోగించిన పదాల వెనకనున్న సాంస్కృతిక నేపథ్యం, సామాజిక అనుభవం, భావసూక్ష్మతలను ఆవంత్స సోమసుందర్ గారు వివరించిన తీరు ఒక సాహిత్య పాఠశాలలో పాఠాలను అందించినట్లుగా వుంది.

అక్షరానికి మొదట నమస్కరించి, ఈతకోట సుబ్బారావు కవితా సమాలోచనకు స్వీకారంచుట్టిన డాక్టర్ ఆవంత్స సోమసుందర్ గారు, కవి అందించిన కవితా సంపుటిల తలుపులు తెరిచి అందులోని ప్రతిభావాన్ని తన విశ్లేషణ పరిధిలోకి ఆహ్వానించారు. సోమసుందర్ గారి స్పర్శ కోసం ఆరాటపడిన 'నరవాహనం', 'చివురంత ఆశ', 'వల్లెవానన కోల్పోయిన బ్రతుకు', 'కథకావాలి', 'ఝండా ఉంచా రహే హమారా', 'లోహస్పర్శ', 'ఉత్తరం బావి', 'కన్నీటి సేద్యం', 'కాంక్రీటుచెట్టు', 'ఒంటరిసమూహం' కవితలతోపాటు మరెన్నో కవితలు ఆవంత్స సోమసుందర్ గారి సమాలోచన హాజరుపట్టీలో సంత కాలు చేసి, ఫలితాలకోసం ఎదురుచూస్తూ నిలబడ్డాయి.

ఈతకోట సుబ్బారావు గారి 'అక్షరానికో నమస్కారం' పుస్తకాన్ని సోమసుందర్ గారు సమాలోచన చేస్తూ ఆ కవిత్వంలో అక్షరానికి కేటాయించిన విశిష్టస్థానాన్ని ప్రత్యేకంగా విశ్లేషించారు. 'అక్షరమే ఆదిశక్తి, ఓంమిత్యేకాక్షరం బ్రహ్మ' అంటూ మన పూర్వులు అక్షర స్థానాన్ని నిర్దేషించిన వాక్యాలను ఉటంకిస్తూ, కవి హృదయం అక్షరాన్ని ఏ విధంగా యోచనాధారగా నిలిపిందో సోమసుందర్ గారు వివరించారు. 'అమ్మా' అన్న వేదనామృతం లేనివేళ, మనిషికే అమృతాంజనం మిగిలేదో" అంటూ కవి ప్రయోగించిన వాక్యంలో అమ్మ మాటలోని మహత్యాన్ని గుర్తుచేస్తూ, అమృతాంజనం మీద గొప్ప చమత్కారాన్ని విసిరారు. భాష అన్నది మహత్తర సంపదలలో మొదటిదని అంటూ, 'విభూతిర్ భూతిరైశ్వర్యం' అన్న అమరకోశకారుణ్ణి ఈ సందర్భంగా తలచుకొనే అవకాశాన్ని కల్పించారు. మానవ జీవితాన్ని బహుముఖీన మార్గాలలో తోడు, నీడై నడిపించే కాంతిపుంజంగా అక్షరాన్ని అభివర్ణిస్తూ, 'అక్షరానికో నమస్కారం' కావ్య రచనకు ఒక గొప్ప జీవవంతమైన విషయాన్ని ఇతివృత్తంగా ఎంపిక చేసుకోవడం కవి సాధించిన విజయంగా సోమసుందర్ గారు అభివర్ణించారు.

సర్వే సర్వత్రా మనిషి చీలిపోయిన దృశ్యాలతో వర్తమాన సమాజాన్ని ఈతకోట సుబ్బారావు గారు ఆవిష్కరించిన వాస్తవాల చిత్రపటం 'చీలిన మనిషి'. ఈ కవితా సంపుటి మీద సోమసుందర్ గారు తన స్పర్శ ముద్రలను ముద్రిస్తూ... మనిషిలో ఎప్పుడూ రెండు చీలికలు తొంగి చూస్తుంటాయని, ఒక చీలిక బహిరం గంగా ప్రదర్శితమైతే, మరొక చీలిక రహస్యంగా తన వ్యక్తిగత దుర్మార్గాలను, దుష్ట ప్రవర్తనలను ప్రదర్శిస్తూ పైకిమాత్రం లోకమర్యాదల ఆచ్ఛాదనలను కప్పుకుంటోందని



ఒక కవి సృజనకు మరో ఉన్నతస్థాయి సాహితివేత్త తన మేదో ప్రకాశాన్ని జోడించినప్పుడు కలిగే ప్రయోజనానికి ఈ సమాలోచన ఒక తిరుగులేని ఉదాహరణ.

వ్యాఖ్యానిస్తున్నారు. సమస్త మానవజాతికి ప్రతినిధిగా నిలబడి విశ్వగోళంపై మానవత్వపు జెండాను ఎగురవేసే మనిషికోసం కవి కలలుకంటున్న నేపథ్యాన్ని తనదైన శైలిలో వివరించారు సోమసుందర్ గారు. 'జేబులోని పర్స్ లా మనిషి ఆత్మ జారిపోయింది' అంటూ 'మనుషుల ఎడారి' కవితలోని వాక్యానికి తగిన వివరణను అందిస్తూ, కవి అన్వేషిస్తున్న మనిషికి ఆపన్న హస్తం అందించే గుణం వుండాలని, ఆత్మవ్యక్తతను రెండవ మనిషికి ప్రాణభిక్ష పెట్టే హృదయం ఉండాలని, ప్రక్కవాడి కష్టాల్లో ఆదుకునే నిస్వార్థతత్వాన్ని కలిగివుండాలని, అటువంటి మనిషికోసం, కవితో పాటు నడుస్తున్న కాలం సైతం ఎదురుచూస్తోందన్న వాస్తవాన్ని సోమసుందర్ గారు తన వ్యాఖ్యానంతో స్పష్టపరుస్తున్నారు.

తూర్పు దిక్కున కిటికీ కోయిలవలె గానం చేస్తోంది' ఈ వాక్యంనిండా వేలాది భావాలు పలకరరించడానికి సిద్ధంగా తమ గొంతుల్ని సవరించుకుంటున్నాయి. ఒకప్రక్క వేడుకల జాతర సంతోషాల నృత్యాలు చేస్తూవుంటే, మరో వేదికమీద తెరతీస్తే రైలు బోగీల్లో మాత్రం ఇంకా చీపురుకట్టలతో ప్రవేశించే పదేళ్ళ పిల్లలు కనడుతూనే వున్నారు. రెండు చేతుల్ని గుండెల మీదకి చాచి కాసులు అడుక్కునే అనాథ పిచ్చికలు ఇంకా దీనంగానే అందరివైపు చూస్తూనే వున్నాయి...' అంటూ వ్యాఖ్యానించిన సోమసుందర్ గారు 'కొత్తజెండా' కవితలోని భావానికి రెక్కలు తొడిగి ఎగురవేస్తూ కొత్తజెండా మోస్తున్న మానవుడు సరికొత్త ఆలోచనలకోసం, ఆశయాలకోసం ఎదురుచూస్తున్న చూపుల్ని పరిచయం చేస్తున్నారు. 'వర్తమాన స్థితిగతులు మనిషి హృదయాన్ని కొల్లగొడుతున్నాయి. చిరునవ్వులు పూచే ఋతువులు మాయమై పోయాయి. మమతల సంక్రాంతులు కళావిహీనంగా మారిపోయాయి. ఆత్మీయ ఉగాదుల ఊసును మరచి చాలాకాలమై పోయింది...' అంటూ ఈతకోట సుబ్బారావు గారు అందించిన 'ఒంటరి సమూహం' కవితలోని భావాల జల్లులను తీర్థంలా మనచేతుల్లో పోస్తున్నారు సోమసుందర్ గారు.

ఈతకోట సుబ్బారావు గారి కలంనుండి సృజనకాబడిన కవితల్లోని పదప్రయోగాలను విడదీసి వాటి భావపరిధిని సోమసుందర్ గారు వివరించడం జరిగింది. కవితా సందర్భాలలో వాటికి వున్న సంబంధాన్ని ఈ వ్యాఖ్యాత గుర్తించి వివరించడం చాలా వెలకట్టలేని విలువగా మిగిలిపోయింది. కవి సృజనాత్మకతను ఆవిష్కరించడం వంటి అంశాలు కవిత్వ పఠనాన్ని మరింత ఆసక్తిగా ఎలా మారుస్తాయో సోమసుందర్ గారు ఉదాహరణపూర్వకంగా వివరించారు. సుబ్బారావు గారి కవిత్వాన్ని ఆస్వాదించటానికి, దానిని విమర్శనాత్మకంగా అర్థంచేసుకోవడానికి వాటి మధ్యనున్న అంతరాన్ని ఇటువంటి వాఖ్యానాలు చాలావరకు తగ్గిస్తాయని అభిప్రాయపడ్డ సోమసుందర్ గారి ఆలోచన చాలా ఉన్నతంగా వుంది. 'సందిగ్ధ సమయం' కవితలో 'ఇక్కడ నీ గుప్పెడు గుండెల్లో దాచిన మమతల అనుబంధాలవెల శూన్యం' అంటూ కవి ప్రయోగించిన ఈ మాటల మీద తన వ్యాఖ్యానాన్ని కొనసాగిస్తూ... 'ఈ వాక్యం చక్కటి అభివ్యక్తికి చిరునామా అన్నారు. 'మూగ బోయిన పిల్లనగ్రోవి' అనడమే ఒక గొప్ప విషాదానుభవాన్ని వ్యక్తీకరించడమని సోమసుందర్ గారు తన సంతృప్తితో ఒక దీర్ఘసంతకం చేస్తున్నారు.

కవిత్వాన్ని ఎలా చదవాలి. ఒక కవితలోని అంతరార్థాలను ఎలా గుర్తించాలి, కవి ప్రయోగించిన పదాల వెనకనున్న అనుభవ ప్రపంచాన్ని ఎలా ఆవిష్కరించాలన్న విషయాలలో సోమసుందర్ గారు చాలా విలువైన సూచనలు చేశారు. ఇవి అటు సాహిత్యకారులకు, ఇటు పరిశోధకులకు మరియు భావితరాలవారికి వెలుగు దీపాల్లా ఎంతగానో ఉపయోగపడుతాయి. కవి సృజనకు ఒక సారవంతమైన వ్యాఖ్యానం తోడైనప్పుడు, పాఠకుడు ఆ కవిత్వాన్ని ఎన్నో నూతన కోణాల్లో దర్శించుకునే అవకాశం కలుగుతుంది. ఒక కవి ప్రతిభను, ఆ ప్రతిభలోని విశిష్టతలను గుర్తించడం ఎంత ముఖ్యమో, అదే సమయంలో కవి సృజనలోని కొన్ని పొరపాట్లను కూడా పాఠకులకు పరిచయం చేయడం కూడా అంతే ముఖ్యం. ఆ పాత్రను సైతం అద్భుతంగా ఆవంత్స సోమసుందర్ గారు పోషించారు. ప్రశంసతో పాటు లోపాలను కూడా వివేకంతో సూచించే విమర్శ, కవి కవిత్వ విలువను ఏమాత్రం తగ్గించదు. దాని స్వరూపాన్ని మరింత స్పష్టంగా అర్థం చేసుకునేందుకు తలుపులు తెరిచి ఆహ్వానిస్తుంది. ఈతకోట సుబ్బారావు గారి కవిత్వాన్ని ఆవంత్స సోమసుందర్ గారు సూచించిన విధంగా విమర్శనాత్మక దృష్టితో చదవడంవలన సమగ్ర సాహిత్యానుభవానికి ఎన్నో మార్గాలు ఏర్పడుతున్నాయి.


ఆవంత్స సోమసుందర్ గారి వ్యాఖ్యానంలో ప్రశంసకు వివేచన తోడుగా నిలిచి, సాహిత్యానురక్తికి విమర్శనాత్మక దృష్టి జతపడింది. కవిత్వాన్ని ఆస్వాదించడమే కాకుండా, దాని నిర్మాణాన్ని, భాషను, భావప్రసారాన్ని ఏయే కోణాల్లో పరిశీలించాలో ఆయన సూచించిన కోణాలు శిరోధార్యంగా వున్నాయి. ఆవంత్స సోమసుందర్ గారు నిర్వహించిన 'ఈతకోట సుబ్బారావు కవితా సమాలోచన' కవి కవిత్వానికి వివరణ మాత్రమే కాదు. ఏ కవిత్వానైనా లోతుగా చదవడం ఎలాగో నేర్పించే సాహిత్య పాఠం కూడా. ఒక కవి సృజనకు మరో ఉన్నతస్థాయి సాహితివేత్త తన మేదో ప్రకాశాన్ని జోడించినప్పుడు కలిగే ప్రయోజనానికి ఈ సమాలోచన ఒక తిరుగులేని ఉదాహరణ.

ఈతకోట సుబ్బారావు గారు ఒక సాహిత్య సాగరమైతే, ఆవంత్స సోమసుందర్ గారు ఒక మహాసాహిత్య సాగరం. ఒకానొక సందర్భంలో ఆవంత్స సోమసుందర్ గారి ప్రేమ, వాత్సల్యం, ఆదర ణ, ప్రోత్సాహం ఉప్పొంగిన సమయంలో ఒక సాగరాన్ని మరో మహాసాగరం. కరచాలనం చేసుకున్న సందర్భ మిది. సోమసుందర్ గారి అత్యంత విలువైన సమాలోచనకు నమస్కరిస్తూ, గొప్ప కవితతా సంపదను అందించిన ఈతకోట సుబ్బారావు గారికి హృదయ పూర్వక అభినందనలు.

'సాహిత్య ప్రపూర్ణ'

-డా॥ కె.జి. వేణు

98480 70084



నేటినిజం సాహితీ కెరటాలు

website:www.netinijam.com

website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 గురువారం 5-11-2026

సప్త పదులు



ప్రక్రియా సృజనకర్త:
సుధామ
సెల్:9849297958

అందనిది
పొందనిది

విలువలేదు అని
వదిలేయ్
నీకు
చెందనిది.

-సూర్యకళ తనికెళ్ళ
విశాఖపట్నం.

తెలుసుకో
రాసుకో

నిదానంగా
మంచి దస్తూరి
అలవాటు
చేసుకో...

-సరోజ రెబ్బాప్రగడ
బెంగళూరు

విరులు
కురులు
మరులు కొలిపే
అలనాటి
సంప్రదాయ
సిరులు

-వై.నాగేశ్వరరావు
దయాల్‌బాగ

ఆధారం
మూలాధారం
రేపటి కోసం
దాచిన
జలమే
ప్రాణాధారం

-కాయల నాగేంద్ర,
హైదరాబాద్

ముఖ్యాంశం
ప్రధానాంశం
మన జీవనశైలే
పిల్లలకి
భావి
పాఠ్యానీశనీ

-శ్రీవాణి, తెనాలి

కాసులు
కేసులు
ఓట్ల పండగలో
అర్థంకాని
ఎన్నో
తిరకాసులు

-శేష శైలజ(శైలి)
విశాఖపట్నం

ఇష్టంగా
దృష్టంగా
నీకంటూ
జీవిత లక్ష్యాన్ని
ఎంచుకోవాలి
స్పష్టంగా

-సింగీతం
విజయలక్ష్మి,చెన్నై

అడుగు
మడుగు
మనస్సుని
మంచికి మళ్ళించి
శుభ్రస్థగా
కడుగు .

-మా.శ్రీ.రాజు
పాల్వంచ

అన్నాక!
విన్నాక!!

ఏదైనా ఆలోచించు
చేయి
విషయం
కనుగొన్నాక!!!

-మన్నవ సుధాకర్
విజయవాడ

గతము,
స్వగతము

భగవంతుడు
ఉన్నాడని నమ్మడం,
నమ్మకపోవడం
వ్యక్తిగతము!

-దినవహి సత్యవతి
గుంటూరు

పల్లెబస్సు

పయనమై
ఈ లోకానికి ఎట్లా వచ్చిన్నో
గుర్తుకు లేదు, కానీ..
బుద్ధి తెల్సినాక మాత్రం
నా తొలిప్రయాణం బస్సులో నే..
మాది బస్సుబంధం..
మా పల్లెకు మొదటిసారి బస్సొచ్చిన రోజు
మా ఊరికి పండగొచ్చినట్లే ఐంది..
బస్సుమెడలో బంతిపూలదండలు,
మామిడితోరణాల మాల,
చెరుకుచెట్ల అలంకరణ,
డ్రైవరన్నకు పొడూబొట్టు
కండక్టర్ సాబ్ కు కంకణధారణం..
గుండెలను పూర్ణకుంభాలు చేసి చెప్పిన
ఘన స్వాగతాలు..
ఊర్లోకి వచ్చిన బస్సువెనక
దుమ్ముపీల్చుకుంటూ దమ్మొచ్చిందాకా
మా పిల్లల పరుగులు..
బస్సు రాంగ నమస్తేలు
బస్సుపోంగ టాటాలు..
రోజూ బస్సు
రాకపోకలు ఉత్సవాలే.. ఉత్సాహాలే!
తొలిప్రయాణాల్లో
నా వాంతులను భరించీ,
పై చదువులకు ఊరొదిలిపోయేటపుడు
నా ఏడుపులను సముదాయించీ,
ఇంటికి సెలవులకు వచ్చేటపుడు
చిరునవ్వులతో స్వాగతించి,
కళాశాల చదువుల్లో మురిపించి,
తొలి ఉద్యోగమిప్పించి..
వివాహానికి ఒప్పించి..
కొత్తకాపురానికి సామానులప్పగించిన
బస్సు..
అమ్మానాన్న తర్వాత
అంతటి ఆత్మబంధువై నిలిచింది..,
తర్వాత
ప్రయాణరూపాలు స్కూటరై..
బైకులై.. కారులై సాగుతున్నా,



పల్లె బస్సు ప్రయాణాలే భద్రంగా
హృదయం లో నిలిచిపోయాయి..
ఇపుడు పండగ వేళ,
వదిలి వచ్చిన
కన్న ఊరు , కనులకొలనులో
కలువల పరిమళమై
తిరుగాడుతున్నది..,
పల్లెబస్సు జ్ఞాపకాలదుమ్ము
రేపుకుంటూ..
మనసు చౌరస్తాలో
రయ్యిమని
తిరుగుతున్నది!

-డా॥ కాసర్ల
9441406252



మిస్టర్ క్లీనా! ఎవడాడు?



'మిస్టర్ క్లీన్' అని మీరు పదేపదే అంటున్నారు. అది ఆయన పెట్టుకున్న బిరుదా! ఈ దేశంలో స్వయం ప్రకటిత మేధావులు ఉన్నారు. మేం తత్వవేత్తలం అంటారు. ప్రపూర్ణలం అంటారు. ఇంకా చాలా చాలా అంటారు. అవన్నీ బయటివారు ఇచ్చినవి కాదని కొంతమందికి తెలుసు. అయినా ఏంటి మీ 'క్లీన్' గారి ప్రత్యేకత? వారేమైనా పులు కడిగిన ముత్యమా. ఇప్పటివరకూ క్లీన్ గారికి, ఎలాంటి మరక అంటలేదా? మీరు ఆయన్ని 'మెంటార్' అంటారు. గురుతుల్యులు అంటారు. అందుకు ఎవరికీ అభ్యంతరం ఉండదు. మీరు అతన్ని గురువు అనుకుంటున్నారు. అంతవరకే. అతను విశ్వ గురువు కాదు కదా. మీరు క్లీన్ గారిని ప్రపంచం మీద రుద్దుతున్నారా? అది మీ అమాయకత్వమా? అజ్ఞానమా? అహంకారమా? అదేదో ఇప్పుడు తేల్చుకుందామని వచ్చాం" అంటూ నలుగురు వచ్చారు. మాకు ఇది మొదటి అనుభవం.

ఇంతకుముందు పురాణాలను వక్రీకరిస్తూ కథలూ, నవలలూ, వ్యాసాలు, గ్రంథాలు రాసినప్పుడు, అలాగే ఇతర మతాల గ్రంథాల మీద సినిమాలు తీసినా, రచనలు చేసినా దాడులు జరిగాయని, అలాగే కొంతమంది రచయితలను చంపి తలలు తెచ్చినవారికి కోట్లాది రూపాయల బహుమతులు ఇస్తామని ప్రకటించారని, అలాంటివారు కొందరు తమ దేశాల్ని వదిలి రహస్యంగా బతుకుతున్నారని మేం పెద్దలు చెప్పగా విన్నాం. ఇది ఒక్క మన దేశంలోనే కాదు. ప్రపంచమంతటా జరుగుతున్నదే. ఇంకా వివరంగా చెప్పాలంటే ఇవన్నీ మత గ్రంథాలకు పరిమితం కాదు. వ్యక్తులను విమర్శించినా, వ్యవస్థలను విమర్శించినా, బృందాలు బృందాలుగా దాడులు జరుగుతాయి. ప్రతిదాడులు జరుగుతాయి.

అయితే 'మిస్టర్ క్లీన్' అన్నంత మాత్రాన కూడా ఈ రకంగా రియాక్టవుతారని మాకు తెలియదు. అన్యా, విదూ, నేను ఒకరి ముఖం ఇంకొకరు చూసుకున్నాం. వచ్చినవారి చేతుల్లో కర్రలు, బరిసెలు, కత్తులు లాంటి మారణాయుధాలు లేవు కాబట్టి ఊపిరి పీల్చుకున్నాం. అయినా మేం చిన్న పిల్లలం. నలుగురు కంటి చూపుతో కాకపోయినా పిడి గుద్దులతో మమ్మల్ని స్వర్గానికి పంపగలరు.

"అయ్యా – మీరు ధర్మ సందేహంతో వచ్చారా? సత్యాన్వేషణకు వచ్చారా? వేదాంత చర్చకు వచ్చారా? అయినా అన్ని రంగాల్లోనూ ప్రముఖులకు వందలాది బిరుదులు ఉన్నాయి. అవి ఎవరు ఇస్తున్నారో – జనం నుండి అవి పుడుతున్నాయో మేం పరిశోధన చేయలేదు. మీరు మా 'క్లీన్' గారిని విమర్శిస్తున్నారా? లోకంలో ఉన్న అందరినీ విమర్శిస్తున్నారా? అందరి దగ్గరికి ఇలా వెళ్ళి నిలదీస్తున్నారా? దయతో వివరించండి" అన్నాను.

"అతి వినయం ధూర్త లక్షణం అంటారు పిల్లలూ. మీకు దయతో వివరించాలా? మీరు దయతో మిస్టర్ క్లీన్ అంటున్నారా? ఈ రోజు మిస్టర్ క్లీన్ అంటారు. రేపు మిస్టర్ ఇండియా అంటారు. తర్వాత మిస్టర్ యూనివర్స్ అంటారు."

"అంటే అంటాం. మీకు వచ్చే నష్టం ఏముంది? మీరు మిస్టర్ చెత్త అనండి. మిస్టర్ కంపు అనండి. మురికి కూపం అనండి. మీకు ఆ హక్కు ఉంది కదా. దానికి ఇంత దృశ్యం క్రియేట్ చేయాలా?" అంది అన్య.

"ముందు ఇది చెప్పండి. మిస్టర్ క్లీన్ అని అతను పెట్టుకున్నాడా? మీరు కాయిన్ చేశారా?" అన్నాడు ఓ వ్యక్తి.

"మేమే అలా పిలుచుకుంటాం " అన్నాడు విదు.

"ఎందుకలా పిలుస్తున్నారు?"

"ఆయన ఎప్పుడూ నీట్ గా షేవ్ చేసుకుంటారు. నో మిసాలు, నో గడ్డాలు. ఉదయం బాత్ రూమ్ లోకి వెళ్తే షేవ్ చేయందే బయటకు రాడు. ఆ మాటకొస్తే మిలోనూ మిస్టర్ క్లీన్ లు ఉన్నారు" అంది అన్య.

"మా తాతగారు చెప్పేవారు – ఆయన చదువుకునేటప్పుడు ఓ లెక్చరర్ ఉండేవారంట. ఆయన్ని 'మిస్టర్ టినోపాల్' అనేవారంట."

"అంటే?"

"ఎప్పుడూ వైట్ అండ్ వైట్ ప్యాంట్, షర్టుల్లో ఉండేవారు. మీ బట్టలు తెల్లగా ఉండాలంటే మా టినోపాల్ ని వాడండి అని ప్రకటనలు వచ్చేవంట. అలాగే పిల్లలకు, పంతుళ్ళకు రకరకాల నిక్ నేమ్స్ ఉండేవంట. ఇప్పటికీ ఉంటాయి. వాటి మీద చిన్న చిన్న గొడవలు జరుగుతుంటాయి. అయినా మీరు మాత్రం ఎవరినీ నిక్ నేమ్స్ తో పిలవరా? ఎవరినీ గురువా అనరా? అయినా మీ కోపం మా మీదా? మిస్టర్ క్లీన్ మీదా?" అన్నాను.

వాళ్ళు ఒకరి ముఖాలు ఇంకొకరు చూసుకున్నారు.

"ఆయన చెప్పే విషయాల మీద మీకు అభ్యంతరం ఉంటే కౌంటర్ ఇవ్వండి సర్. ఆయనకు మరక అంటలేదా అంటే మరకలు అంటుకోకుండా ఎవరుంటారు సర్. ఇంట్లోకి దుమ్ము రాదా? వీధులన్నీ తళతళ మెరిసిపోతున్నాయా? మీరు ఆటోల్లో, బస్సుల్లో వస్తున్నారు. కార్లలో కూడా రావచ్చు. ఆ గొట్టాల నుండి నల్లటి పొగ మేఘాలు వస్తాయి.. ఆపగలరా? సాయంకాలం ఫ్యాక్టరీలు విష వాయువులు వదులుతాయి. పీల్చకుండా ఎంతసేపు ముక్కు మూసుకుంటారు. వీటి గురించి మాట్లాడకుండా 'మిస్టర్ క్లీన్' అంటున్నందుకే బాధపడి పోతున్నారేంటి మహాశయురాలా?" అంది అన్య.

నలుగురు పక్కకు వెళ్ళి మాట్లాడుకున్నారు.

"వీళ్ళు పిల్లలు అనుకున్నాం. పిడుగుల్లా ఉన్నారు. వీళ్ళతోనే ఇలా ఉంటే ఇప్పుడు మిస్టర్ క్లీన్ ని పిలిస్తే ఏం జరుగుతుందో ఊహించుకుంటే భయంగా ఉంది. అసలు దేశంలో ఇన్ని సమస్యలు ఉండగా మనం క్లీన్ గురించి మాట్లాడటానికి రావటం ఫూలిష్నెస్" అన్నాడొకడు.

"వాడు నన్ను ఇన్ డైరెక్ట్ గా కామెంట్ చేశాడు. అలా వదిలేస్తే మనందరినీ వాయకొడతాడు" అన్నాడతను.

"నిద్రపోతున్న గాడిదను నిద్రలేపి తన్నించుకోవటం అంటే ఇదే. అసలు ఇప్పుడు దేశం – ప్రపంచం ఈ బిరుదుల మీద నడుస్తోంది. ట్రంప్ గారికి – శాంతికాముకుడిగా నోబుల్ బహుమతి కావాలంట. తనను మించిన శాంతి కపోతం లేదని వారు స్వయంగా ప్రకటించుకుంటున్నారు. అతని పిచ్చి ముదిరితే ఆ పురస్కారం ఇవ్వని వారి మీద వందశాతం పన్నులు వేస్తానంటాడు. లేదంటే బాంబులు వేస్తానంటాడు. ఇప్పుడు నువ్వు ట్రంప్ ని నిలదీయగలవా?"

"అనవసరంగా ఇందులో దిగాం. ఇప్పుడు బయటపడే మార్గం చెప్పండి" అన్నాడతను జీర నిండిన స్వరంతో.

"ఇందుకు ఒకటే మార్గం?"

"ఏమిటది?"

"మిస్టర్ క్లీన్ అనటం వారి అజ్ఞానం కాదు. అహంకారం కాదు. ముందుచూపు అని అంగీకరించాలి. వీలయితే పిల్లలకో బిరుదు ఇవ్వాలి."

"నా మనసు అంగీకరించటం లేదు."

"మనసు కూడా ఓ బిరుదే. నువ్వు నోర్ముయ్" అని వారి దగ్గరకు వచ్చారు.

"పిల్లలూ – మేం సరదాగా మీతో నటించాం. మిస్టర్ క్లీన్ అనేది బిరుదు కాదు. నగ్న సత్యం. అలాంటివారు లేకపోతే ఈ మురికిని క్లీన్ చేసేవారుండరు. మీరు మాస్టర్ క్లీన్ లు. ఇంకా ఇంకా మీ నుండి ఎన్నో ఆణిముత్యాలు రావాలి. మీ అందరికీ మా బ్లెస్సింగ్స్" అని వెళ్ళారు.

మాకిది కొత్త పాఠమే!



- పి.చంద్రశేఖర అజాద్
92465 73575

చిట్లిపోయిన బాల్యం

పూలవనం చేరాలనుకున్న
ఓ మొగ్గ, పాఠశాల గడప దాటి,
విధి చేతిలో విరిగిన గాజుబొమ్మ అయింది!.
అక్షరాల ఒడిలో ఆశ్రయం పొందాల్సిన వయసు,
అన్యాయపు అగ్నిలో ఆహుతైన కాగితపు పడవైంది!.
ఆమె నవ్వు ఉదయపు మంచుబిందువు,
ఆమె కలలు రెక్కలు విప్పిన రంగుల సీతాకోకచిలుకలు!
చీకటి తన నీడను ఆమెపై పరచింది,
మృగత్వం మానవత్వపు ముసుగు తొడిగింది!.
పుస్తకంలోని పూలబొమ్మకు రంగులద్దాల్సిన చేతులు,
బతుకు చిత్రంలో కన్నీటి చారలు గీశాయి!.
తెల్లని కాగితం లాంటి బాల్యంపై
విషపు సిరాతో విషాదగీతం రాశాడో దుష్టుడు!
తల్లి గుండె తుఫానులో చిక్కుకున్న గూడు,
తండ్రి ఆశ నేలకొరిగిన మహావృక్షం!.
న్యాయం ఇంకా మగత నిద్రలో ఉంది,
చట్టం మౌనపు సంకెళ్లలో బందీ అయింది!
ఆడపిల్ల భద్రత ప్రశ్నార్థకమై,
అభివృద్ధి అద్దంలో సమాజపు ముఖం మసకబారింది!.
వికృత మనస్తత్వాలకు మూలాలు,
పెంపకంలోనా? పరిసరాల్లోనా?
విలువల పతనంలోనా?
ఒక విద్యార్థిని కన్నీరు దేశపు
మనస్సాక్షికి అద్దం కావాలి,
తీర్పు, శిక్షలకు మించి సమాజంలో సంస్కరణ రావాలి!
రాజ్యాంగపు స్ఫూర్తి ప్రతి గుండెలో నాటాలి,
బాలల హక్కులు ప్రతి బడిలో బోధించాలి!
నేరస్థుడికి శిక్ష... సమాజానికి కనువిప్పు కావాలి.
మరో బాల్యం చిద్రమవకుండా మానవత్వం మేల్కొనాలి!
ఒక మొగ్గ రాలిన విషాదం చరిత్రగా మిగలక,
వెయ్యి బాల్యాల భద్రతకు పునాదిగా నిలవాలి!
(రాస్తాడు విద్యార్థిని
దుర్ఘటన నేపథ్యంలో..)

-షేక్ నసీమాబేగం
9490440865



రాష్ట్ర సాధనాంతరం వేడిని కోల్పోయామా ?

తెలంగాణ రచయితల సంఘం పన్నెండేండ్ల సభలో -కె.శ్రీనివాస్

తెలంగాణ రచయితల సంఘం 12 ఏండ్ల సభలో రవీంద్రభారతి సమావేశ మందిరం హైదరాబాదులో నవంబర్ ఒకటవ తేదీ ఆదివారం రోజు ఉదయం 10:30 నుండి సాయంత్రం 6:00 వరకు జరిగాయి. ఈ సభలలో **"వర్తమాన సాహిత్యం – తెలంగాణ సంభాషణ"** అనే అంశం మీద సదస్సు జరిగింది. ఈ సభలో మూడు సెషన్లుగా కొనసాగినాయి. మొదటి సభ **ప్రారంభ సభ** రెండవ సభ **వర్తమాన సాహిత్యం –తెలంగాణ సంభాషణ సదస్సు** మూడవ సభగా **3 విడతల కవి సమ్మేళనం** జరిగింది.

ఉదయం జరిగిన ప్రారంభ సమావేశానికి ఘణపురం దేవేందర్ సభ ఆహ్వానం పలికారు. డాక్టర్ నాళేశ్వరం శంకరం సభా అధ్యక్షత వహించారు. తెలంగాణ రచయితల సంఘం వర్తమాన సాహిత్యం తెలంగాణ సమాజంతో జరుగుతున్న సంభాషణని ఒక చైతన్య అంశంగా తీసుకొని తరాలను ఆలోచింపచేయాలని ఇన్నేళ్లుగా చేస్తున్న కృషి నేపథ్యాన్ని వివరించారు.అలాగే నిరంతరంగా జరుగుతున్న సమావేశాలలో భాష మీద సమావేశం జరిపాము తెలంగాణ భాషను ప్రధానంగా తీసుకున్నామని చెప్పారు.ఇవాళటి సభ ఒక గొప్ప ప్రయోజనవంతంగా ఉంటుందని అధ్యక్ష ఉపన్యాసం చేశారు.

డాక్టర్ వి. శంకర్ తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. 12 ఏండ్ల రచయితల సంఘం యొక్క ప్రయాణాన్ని విశేషాలను సభలో సమర్పించారు సాహిత్యమే జాతి గౌరవాన్ని నిలబెడుతున్నదని దాశరధి నుండి ఇవాల్టి వరకు గల పరిణామాలు చెప్పారు. లక్ష్యాలను కొనసాగించవలసిన అవసర నేపథ్యంలో తెలంగాణ రచయితల సంఘం ఏర్పడింది అని కార్యశాలలు సభలు ,సమావేశాలు, కవి సమ్మేళనాలు ,సంస్మరణ సభలు ,కవితా పఠనం, పుస్తక ప్రచురణలు రచయితల పట్ల బాధ్యతతో మానవీయంగా అండగా నిలబడటం వంటి అనేక కార్యక్రమాలను నిర్వహించిందని రాష్ట్ర వార్షిక సభలు నిర్వహించామని అభినందన సభలు జరిపామని జిల్లాలో పలు సాహిత్య కార్యక్రమాలు జరుగుతున్నాయని, అలాగే జంట నగరాల శాఖ అంతర్జాల సమావేశంలో ప్రతి వారం సోమవారం కవి సమ్మేళనం జరుపుతున్నారు .పుస్తకాలు వేస్తున్నారు అని కవులపై రచయితలపై కళాకారులపై నిర్బంధం కలిగినప్పుడు వారి పక్షాన నిలిచామని చెప్పారు.

ఈ సభలలో ప్రముఖ పాత్రికేయులు కే .శ్రీనివాస్ కీలకోపన్యాసం చేశారు. వర్తమాన ప్రపంచం పరిస్థితి గురించి మాట్లాడారు. మన స్పందనల విషయంలో మనం ఎట్లా ఉన్నాం ? మనం ఏం చేయాలి? అనే ప్రశ్న చిన్నగా కనిపిస్తుంది కానీ చాలా పెద్ద చర్చనీ అంశం అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న పరిణామాల దాకా చర్చ చేశారు. ప్రస్తుత పరిస్థితులు రాజకీయ ఉద్యమంగా మారుతున్నాయని .వ్యవస్థను మార్చాలని చూసినప్పుడు ఒక ఐస్ బ్రేక్ చేయవలసి వస్తుంది. మనం తర్వాతి తరాలతో సంబంధంతో ఉన్నామా? అనేది పరిశీలించుకోవాలి బయట ఏం జరుగుతుందో పట్టించుకోవాలి. పాట ఉద్యమంలో బలంగా పనిచేసింది. వందలాది పుస్తకాలు వచ్చాయి. తెలంగాణ అస్తిత్వ ఉద్యమాలను నడిపించింది . తెలంగాణ రావటం ఒక ఉద్యమ ప్రయత్నానికి విజయం. ఆ తర్వాత ఏమిటి అనేది ముఖ్యమైన విషయం. భౌగోళిక రాష్ట్రం కోసమేనా మనం ఇంత కష్టపడింది? తర్వాతి రాజకీయ లక్ష్యం ఏమిటి? స్థానికులకే వనరులు రాజకీయం అన్నీ, అనే విలువలు అనుకున్నాం ఆ విలువల ప్రాసంగీకత ఉన్నది. అనేక అవకాశాలు పొందాల్సి ఉంది అనుభవంలోకి రావాల్సి ఉన్నది. అనేక రంగాలలో కూడా.సమీక్ష సరిగ్గా రావాల్సిన అవసరం ఉంది .హేళన చేస్తున్న కొత్త ప్రభుత్వం లోను మనం నిస్సహాయంగా ఉన్నాం. ఒక సమీక్ష అవసరం ఉంది. ఉద్యమ సాహిత్యంలో ఉన్న వేడిని రాష్ట్ర సాధన అనంతరం కోల్పోయామేమో రాజకీయాల మీద పై చేయి కావలసి ఉన్నది. ప్రపంచంలో ఏం జరుగుతుందో పట్టించుకోవాలి. విప్లవ సాహిత్య ఉద్యమం భావవ్యక్తి కేంద్రీకరణగా పనిచేసింది 2014 తర్వాత కూడా సాహిత్యం అలాగే కొనసాగి ఉండాల్సింది.కథ నవల చారిత్రక ధోరణులు ప్రయోగాలలో పరిణామం ఏమిటి? అప్పటి స్థానానికి ఇప్పటి స్థాయికి పోల్చి చూస్తే భాగస్వామ్యం ముందుండి నడిపించేతనంలో కొంత వెలితిగా ఉన్నది .ఇవాళ పరిస్థితులలో పునరాలోచించుకోవలసి ఉన్నది.ఎందుకు మతతత్వ వ్యతిరేక రచనలు రావడం లేదు ? ఎవరికి వాళ్లుగా ఒక ఎజెండా చేసుకుని వర్క్ చేస్తున్నారు ఒక సంఘంగా చేయవలసిన అవసరం ఉన్నది. యువ రక్తంతో చురుగ్గా వెళ్లాల్సిన అవసరం ఉన్నది. మరో కుదుపు కావాలేమో అనిపిస్తున్నది. చిన్న పరిధిలో నుంచి బయటపడాలి మనకు తెలవని మన సమాజం కడుపులో ఏమున్నదో ఆ దిశ వైపు అడుగు లేయాలి అని వర్తమాన దర్శనం చేశారు.

విరాహత్ అలీ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు సామాజిక స్పృహ ప్రజా జీవితం పట్ల సాహిత్య దృక్పథంతో తెలంగాణ రచయితల సంఘం కృషి చేస్తున్నది, రచయితల సంఘానికి ఖచ్చిత మైన ప్రణాళిక ఉన్నది 12 ఏళ్ల ప్రయాణంలో అనేక సభలలో నేను పాల్గొన్నాను. ఇన్నాళ్ళ కాలంలోనూ సాహిత్య కార్యక్రమాలు జరిగాయి. లక్ష్యానికి అనుగుణంగా పనిచేస్తున్నది. నాళేశ్వరం శంకరం తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నిర్వహణలో చాలా దృఢమైన వాడు. దృఢమైన సంకల్పం గలవాడు. లక్ష్యాలు ప్రతి సభ్యునికి చేరాలని తపన పడతాడు అన్నారు.



కీలకోపన్యాసం చేస్తున్న డా॥కె. శ్రీనివాస్. వేదికపై డా॥వి. శంకర్, బైస దేవదాసు, డా॥ఏనుగు నరసింహారెడ్డి, డా॥ నాళేశ్వరం శంకరం, డా॥ నందిని సిధారెడ్డి, విరాహత్ అలి



డా॥నందిని సిధారెడ్డిని సత్కరిస్తున్న అతిథులు



సభలో ప్రసంగిస్తున్న దేశపతి శ్రీనివాస్

నేటినిజం పత్రికా సంపాదకులు బైస దేవదాసు నేటి నిజం తరపున శుభాకాంక్షలు అభినందనలు తెలుపుతూ అన్ని సభల కన్నా ఈ సభ భిన్నమైంది, అధికార పక్షానికి, ప్రతిపక్షానికి దూరంగా ప్రజల పక్షానికి అండగా ఉన్న సంస్థ తెలంగాణ రచయితల సంఘం అన్నారు. మెలకువలు గల సంస్థ, మెలకువలు నేర్పుతున్న సంస్థ. ఇలాంటి సంస్థ ఇంకొకటి కనిపించదు. ఈ తెలంగాణ రచయితల సంఘానికి రంగులు లేవు. ఈ సంస్థకు ఒక ప్రజల స్థాయి ఉన్నది.

మరొక ముఖ్య విషయానికి వస్తే, చిన్ననాట అలాగే గల్లా గురిగిలో పైసలు జమ చేస్తే నూరు పైసలు అయ్యాయి అప్పుడు నేను ఎంతో సంతోషపడ్డాను ఇవాళ అభినందనలతో పురస్కారాలకు నాకు తరచూ వస్తున్న నగదును అలాగే ఒక గల్లా గురిగిలో వేశాను. మా వీణ నేటి నిజం ప్రచురణకర్తతో ఈ డబ్బులు ఏం చేద్దామని ప్రస్తావన వచ్చినప్పుడు పుస్తక ప్రచురణ చేద్దాం అని నేను అన్నాను. కానీ వీణ ఒక సంస్థకు ఇస్తే సంస్థ కార్యక్రమాలు గొప్పగా సాగుతాయని సంస్థకు ఇద్దామని చెప్పినప్పుడు మాకు అంత నిబద్ధత కలిగిన సంస్థ, తెలంగాణ రచయితల సంఘం సరైందని తోచింది. జమ అయిన ఆ ఒక లక్ష రూపాయలు తెలంగాణ రచయితల సంఘానికి ఇద్దామని అనుకున్నాం. సంఘం యొక్క నిబద్ధతకు ఇది మా అంగీకారం.

ఏనుగు నరసింహారెడ్డి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు కవి ఎటు ఆలోచించాలి? పాలక పక్షం కాదు ప్రతిపక్షం కాదు ప్రజాపక్షంగా ఉండాలని చెప్పారు. నిజంగా ప్రజల గురించి ఆలోచించే కవులు కళాకారులు రచయితలు మాత్రమే మిగిలి ఉన్నారు తెలంగాణ రెండు ఉద్యమాలు సువర్ణాక్షరాలుగా మనకిచ్చింది . ఒకటి సాయుధ పోరాటం అయితే తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం మరొక ముఖ్యమైంది రెండు ఉద్యమాలు గొప్ప పాఠాలను ఇచ్చాయి. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఒక రక్తపు చుక్క లేకుండా , శత్రువుతో ఎక్కడా ఆయుధాలతో పోరాడకుండా హింస లేకుండా రాష్ట్ర సాధనను సాధించింది. ఇవాళటి పరిస్థితులలో తెలంగాణ సమాజంలో ఏం పుస్తకాలు ఉన్నాయి. ఎలా రావాలి ? అనే ఆలోచనలు చేయాల్సి ఉంది. ఇవాళ జెన్ జీ ఒక ఆలోచించవలసిన పరిస్థితి. మతతత్వం ఏజెండా అవుతున్నది కవులు ఆలోచించాలి సోమనాథ్ యాత్ర ఒక ఎజెండా అవుతున్నది. అనేక యుద్ధాలు జరుగుతున్నాయి. రివ్యూ చేస్తే వచ్చిన కవిత్వం తక్కువ ఉనికి ఏమిటి అని ఆలోచించాలి. ఉత్తర భారతదేశం మత కులవాదంతో ఉన్నది. మన అంత ముందు చూపు అక్కడ లేదు. పథకాలు ఇవ్వవచ్చు కానీ అవసరం ఉన్న వాళ్లకు చేరాలి. అనే పథకాల గురించి చెప్పారు కవిగా రచయితగా ఎన్నికల దుర్మార్గాలను మనం ఎందుకు ప్రశ్నించకూడదు? తెలంగాణ రచయితల సంఘం తరపున వర్క్ షాప్ పెడితే కథా నవలపై పెట్టాల్సిన అవసరం కూడా ఉన్నది వచన కవిత్వాన్ని దాటి ఇతర కవిత్వాన్ని పట్టించుకోవాల్సిన అవసరం కూడా ఉన్నదని భావించారు. వ్యంగ్యంగా చెప్పడం కూడా అవసరమే అన్నారు.

దేశపతి శ్రీనివాస్ ఎమ్మెల్సీ గారు, తెలంగాణ రచయితల సంఘం 12 ఏళ్ల పూర్తి చేసుకున్నది .ఆదిపత్యం దుర్మార్గంగా చెలరేగుతున్నప్పుడు సంఘంగా ఎదుర్కోగలమనే కాన్ఫిడెన్స్ మాలో ఉన్నది . మంజీరా రచయితల చైతన్యం కూడా అదే . మంజీరా రచయితల సంఘం 40 ఏళ్ల సభలు ఈ మధ్యనే జరుపుకున్నది. మంజీరా రచయితల సంఘానికి కొనసాగింపే తెలంగాణ రచయితల సంఘం అనుకుంటాను. మరసం ఒక గొప్ప ప్రేరణ. ఒక ఉద్భతిని ఇచ్చింది . తర్వాత సోయి పత్రికను నడుపుకున్నాం . ఇప్పుడు తెలంగాణ రచయితల సంఘం కూడా. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఒక భావజాల మార్పుల కోసం ఒక సంఘటితం అవసరం అని తెలంగాణ రచయితల సంఘం ఏర్పడింది. రాజకీయ ఉద్యమ ఉద్భతిని బట్టి ప్రేరణ ఉంటుంది. మన చుట్టూ ఇవాళ గుండెలు పిండే సంఘటనలు ఉన్నాయి. హింస, ఉన్మత్తత, చెలరేగుతున్నది. మనిషి ఎందుకు ఇలా మానవీయతను కోల్పోతున్నాడు? సినిమాలో రకరకాల హింస పరికరాలు వాడుతున్నట్టే కొమ్ములు నరికే ఎలక్ట్రికల్ పరికరంతో మనుషుల్ని చంపడం ఏమిటి? మతశక్తులకు వ్యతిరేకంగా మాట్లాడవలసిన అవసరం ఉన్నది. విశ్వ గురువు భావన తర్వాత రాజకీయంగా ఒక నిలువరింపు వచ్చింది. ఒక దశలో రాజీనామాలు చేయవలసిన స్థాయిని చూశాం.

జెన్ జీ రాజకీయాలను కుదిపేస్తున్నది. మతానికి వ్యతిరేకంగా సభలు పెట్టే వాళ్ళం గతంలో . ఇవాళ ఆ పరిస్థితులు లేకుండా పోయాయి. రావలసినంత మార్పు రాలేదు. ప్రజలను అర్థం చేసుకోవడంలో అస్తిత్వ పరిరక్షణలోనూ చైతన్యం గురించి చర్చలు జరగాల్సి ఉంది. సమీక్ష అవసరమై ఉన్నది. ప్రభుత్వాల కాంట్రాక్ట్ సెంట్రిక్ ధోరణిని వ్యతిరేకించాలి అన్నారు.

తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, డాక్టర్ నందిని సిధారెడ్డి గారు మాట్లాడుతూ 12 ఏళ్ల సభలకు వర్తమాన సాహిత్యం పట్ల తెలంగాణలో సంభాషణ జరగాల్సిన అవసరం ఉన్నది కనుక ఈ అంశాన్ని ఎన్నుకున్నాం. కే శ్రీనివాస్ ప్రామాణికంగా పరిశీలన చేస్తారని కీలకోపన్యాసం చేయాల్సిన అవసరాన్ని ప్రధానంగా తీసుకున్నాం అన్నారు.

ఉద్యమం ఒకే ఉద్వేగంతో ఉండదు . అలాగే రచయిత సాహిత్య సృజనలోనూ ఒకే ఉద్వేగం ఉండదు. ఉద్యమంలో హెచ్చుతగ్గులు ఉంటాయి. కెసిఆర్ నిరాహార దీక్ష తర్వాత, తెలంగాణ ప్రకటించి వెనక్కి తీసుకున్న తర్వాత ఉద్భత రూపం వచ్చింది. 2014 రాష్ట్ర సహకారం తర్వాత ,రాష్ట్రాన్ని సాధించాం అనే ఒక విశ్రాంతి కనబడ్డది. ఇలాంటి దశలో 12 సంవత్సరాల కాలం అనంతరం చర్చించి చూస్తే నిజంగా రచయితలు ఏం రాయాలో స్పురించాలి . జన్ జి నేపథ్యం దాకా వర్తమాన తరం దాకా చర్చ చేసుకోవడానికే ఈ వర్తమాన సాహిత్య సంభాషణ. ఒక్కొక్క కిటికీనీ మూసేస్తున్నారు. విప్లవోద్యమాల్ని క్రూరంగా అణిచివేశారు. రచయితలు స్పందించాలి. రచయితలు ఎందుకు స్పందించలేదనేది ఎవరికి వాళ్ళంగా బాధ్యతగా ఆలోచించాలి. మతోన్మాద అనుకూల, విప్లవ వ్యతిరేక మార్పులు రచయితలలోనే ఉంటే ఎలా? జెన్ జీ కి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. బొద్ది కలతో ఏమి కాదు అన్నారు. బాధ్యతగా ఉండాల్సిన వారు బొద్దింకాలని ఎలుకలు పందులతో పోల్చి మాట్లాడుతున్నారు. విమర్శలు తట్టుకోలేని పరిస్థితిలో ట్రోలింగ్ చేస్తున్నారు. జన్ జీ లను విభజించే ప్రయత్నాలు జరుగుతున్నాయి యువతరం ఏం చేస్తున్నది అనేది ముఖ్యం. యువతకు చెప్పవలసినచోట నిస్సాం కోచంగా చెప్పలేక పోతున్న పరిస్థితులు ఉన్నాయి . యువత కొనసాగాలి కర్రెగుట్టల మీద సీనియర్సే రాస్తున్నారు . ఇవాళటి వాళ్ళ నుంచి రావడం లేదు . మతతత్వం మీద ఏం రాయాలి అంటే నేవధ్యం మూలాలలోకి పోవాలి. మతతత్వంపై అయోధ్య నిర్మాణంపై ర్యాలీలు తీశాం సమావేశాలు పెట్టాం ఇవాళ ఆ పరిస్థితులు లేవు . ఆ సందర్భం లేకుండా పోయింది . ముందు తరంవి చదవమని మాట్లాడే వారు ఎలా కలుస్తారు!ఎలా కలుపుకొని పోతాం! గ్యాప్ని పూరించవలసిన అవసరం ఉన్నది . ఈ గ్యాప్లో సెల్ ఫోన్ కూడా ఒకటి. సోషల్ మీడియాని నమ్ముతున్నారు. వెళ్లే మాధ్యమం సెల్ఫోన్ కానీ వాస్తవం వెళ్ళటం లేదు. అసత్య ప్రచారాలనే తీసుకుంటున్నారు. సెల్ ఫోన్ లో తలవాల్చి న పిల్లలను అన్నం తినమంటే నీకేం తెలుసు చప్పుడు చేయక ఊరుకోమని తల్లిని గద్దించే తరం గురించి ఆలోచించాలి. చట్టబద్ధతతో ప్రయోజనాలు కాపాడ పడలేకపోతున్నాయి. బతుకమ్మలో ప్రతీకలు తొలగించారు. ప్రజాస్వామిక వాతావరణం ఏర్పడిందని మనం అనుకుంటున్నామా! ఇందిరాపార్కు దగ్గర నిరసనలు చేసే ప్రజాస్వామికతను, జంతర్ మంతర్ నిరసనలను ఎత్తివేశారు. ఈ వాతావరణం చర్చనీయాంశం.ఎలక్షన్ కమిషన్ ఓట్లకు ఓట్లు తీసివేస్తున్నది చట్టబద్ధంగా సాధించుకోవచ్చు అనే నమ్మకం ఉన్నదా! రచయిత ఎక్కువ సంక్షోభంలో ఉన్నాడు. రచయిత నీరియన్ గా ఉంటే ఒత్తిడి పెంచుతున్న వ్యవస్థ ఉన్నది. అంతేకాకుండా పుస్తకాలు ఎక్కువ అమ్మితే ఉత్తమం అనే ధోరణి కూడా తెచ్చారు. అదే గొప్ప సాహిత్యం అవుతుందా! ప్రజల సాహిత్యమే గొప్ప సాహిత్యం. అట్లాంటి పుస్తకాలు ఎంతవరకు అమ్ముడు అవుతాయో కానీ ప్రజల గుండెల్లో నిలిచే సాహిత్యం గొప్పది.ఇవాళ మరిన్ని సామాజిక చీలికలు తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. పోరాట రూపాలు వర్ధిల్లాలి. మనం నిరంతరం సంభాషణకు సిద్ధంగా ఉండాలి.తెలంగాణ రచయితల సంఘం అలా ఉంటుందని నమ్ముతున్నాం అని ఉపన్యాసించారు.

హేళన చేస్తున్నా నిస్సహాయంగా ఉండటం దేనికి సంకేతం ? –కె. శ్రీనివాస్
వర్తమానంలోంచే భవిష్యత్తు వికసిస్తుంది ! –ఎన్.వేణుగోపాల్

ఈ సెషన్ కి డాక్టర్ పొన్నాల బాలయ్య ప్రముఖ కవి రచయిత వందన సమర్పణ చేశారు.

భోజనానంతరం జరిగిన రెండవ సెషన్ మధ్యాహ్నం సదస్సు రెండు గంటల నుండి నాలుగు గంటల వరకు జరిగింది. ఈ సదస్సుకు ప్రముఖ కవి,రచయిత, బిల్లా మహేందర్ సభా ఆహ్వానం పలికారు. డాక్టర్ బెల్లంకొండ సంపత్ కుమార్ తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల ప్రధాన కార్యదర్శి సభాధ్యక్షులుగా ఉన్నారు. వీక్షణం పత్రికా సంపాదకులు ఎన్ వేణుగోపాల్, కాకతీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు బన్న అయిలయ్య ప్రధాన వక్తలు . కొండపల్లి నిహారిణి గారు ఆప్త వాక్యం పలికారు.

బెల్లంకొండ సంపత్ కుమార్ అధ్యక్ష ఉపన్యాసంలో తెలంగాణ రచయితల సంఘం 12 ఏళ్ల సభలు ప్రయాణంలో ఒక భాగంగా , వర్తమాన సాహిత్యం –తెలంగాణ సంభాషణ తెలంగాణ రచయితల సంఘం యొక్క బాధ్యతగా చెప్పారు. వర్తమానాన్ని పట్టించుకోని కవులు రచయితలతో ఏం ప్రయోజనం లేదన్నారు. ఇవాళటి పరిణామాల నేపథ్యంలో మనం ఎట్లా ఉండాలి ఏం రాయాలి అనే పలు విషయాలు పొద్దుటి నుండి చర్చకు వస్తున్నాయి.కొత్త వస్తువు కొత్తగా వ్యక్తికరించటం అవసరమే మనిషిని చూసే చూపులో సమాజాన్ని అర్థం చేసుకునే కోణంలో వ్యక్తీకరించే శిల్పంలో వచ్చే పరిణామం కూడా ముఖ్యమైంది అన్నారు.

ఆచార్య బన్న అయిలయ్య గారు వర్తమాన సాహిత్యం అంటే ఒక కాల పరిమితి ఉంటుందని రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి 2023 వరకు గల కథా సాహిత్యాన్ని పరిశీలన చేశారు.సమాజం వినా సాహిత్యం ఆవిర్భవించదు.పాలకులు ఏం చేశారు ? మన అస్తిత్వంలో నుంచి సాహిత్యాన్ని చూడాలి .మన స్వతంత్ర పాలనలో జీవిత ప్రమాణాల మెరుగుదలను ప్రజలు కోరుకుంటున్నారు.అందుకోసం ఎదురుచూస్తున్నారు. రాజకీయ మార్పులు , పాలనా వికేంద్రీకరణ, గిరిజనుల స్వయం గ్రామపంచాయతీల కోరిక, రెవెన్యూ పాలన మార్పులు, సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టడం, రైతు సంక్షేమం , రైతు వేదికల సమస్యల చర్చా, స్త్రీ సంక్షేమం, కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ మొదలైనవి బడుగు బలహీనవర్గాల పథకాలు దళిత బంధు మన ఊరు మనబడి మొదలైనవి అలాగే ఐటి పారిశ్రామిక విధానంలో మిసేవ వంటివి వచ్చాయి . ఈ పరిస్థితుల నేపథ్యం అంతా కథా సాహిత్యంలోకి వచ్చింది. 2014 నుండి 2023 వరకు గల పరిస్థితులుగా కథలలోకి ఇవన్నీ ఎలా వచ్చాయో పరిశీలన చేశారు.మహిళా రిజర్వేషన్లు అమలు కాలేదు. ఇది కథలోకి వచ్చింది. ఉద్యోగాల భర్తీ తాత్సారం జరిగింది. ఇది కథలోకి వచ్చింది. ఉపాధి పథకాలు రాజకీయ పరిస్థితులు ఎన్నికల గురించి కథలు వచ్చాయి . భూ సమస్యలు కథలలోకి వచ్చాయి . విప్లవోద్యమ అనంత పరిణామాలు విద్యా వైద్యం, సామాజిక సమస్యలు కథలలోకి ఏ విధంగా వచ్చాయో బన్న అయిలయ్య గారు వర్తమాన కథాగమనాన్ని ఉపన్యాసించారు.

వీక్షణం పత్రికా సంపాదకులు ఎన్. వేణుగోపాల్ గారు వర్తమాన సాహిత్యం అంటే కాల సూచిక అనే కాదు. ఏ క్షణానికి ఆ క్షణం వర్తమానం. వర్తమానం అనేది ఒక సంక్లిష్టమైన ప్రశ్న ఇది ఒక నిరంతర ధారలో ఒక లిప్త . గతం కొనసాగుతుంది . వర్తమానం కొనసాగుతుంది.భవిష్యత్తులోకి కూడా పోతుంది.భవిష్యత్తులోకి తొంగి చూడాలి . క్రాంత దర్శిగా ఉండాలి . వర్తమానంలోంచి చూడాలి. వర్తమానం గురించి మాట్లాడటం ఎంత ముఖ్యమో భవిష్యత్తులో వికసించడం అనేది కూడా అంతే ముఖ్యం. ఎంతవరకు బందీ అయింది?ఎంతవరకు కట్టుబాట్లను తెంపుకున్నది ?భవిష్యత్తులోకి ఎలా పోగలిగింది ? అనేదే ముఖ్యం. వర్తమానం లోకి తొంగి చూస్తేనే అది నిలుస్తుంది.ఎందుకంటే ఇంతకుముందు మనం ఎప్పుడూ పేర్కొంటూ ఉండే కవులు రచయితలు వర్తమానం నుంచి భవిష్యత్తులోకి చూశారు. ఆ ప్రయాణం తెలిస్తేనే ప్రయోజనవంతం. సురవరం ప్రతాపరెడ్డి,వట్టికోట ఆళ్వారు స్వామి, దాశరధి,కాళోజి మొదలైన వాళ్లు ఇంకా మిగిలే ఉన్నారు . వాళ్లు వర్తమానంతో భవిష్యత్తుతో సంభాషణ చేశారు.వర్తమానానికి విస్తారమైన అర్థం ఉంది. జీవనంలో సుఖశాంతులు వెల్లివిరిస్తే ఆశ అవగాహన అన్వేషణ ఉంటేనే ప్రయోజనం.సమాజాన్ని దాటిన సాహిత్యం ఏదీ లేదు. మొదటి తరం రాసిన వాళ్ళు తెలంగాణ ఇట్లా మారితే బాగుంటుంది అని కలలు కన్నారు.వట్టికోట దాశరథి కాళోజి వంటి వాళ్లు ఆ ప్రయత్నం చేశారు. కనుక మిగిలి ఉన్నారు. తర్వాత నంది దశ వచ్చింది.వారి ప్రయత్నం కొనసాగలేదేమో గతం అయిపోయింది . భవిష్యత్తు మిగిలి ఉంది. నిరంతరం సాహిత్యం సమాజంతో సంభాషించటం ప్రయోజనవంతమైంది. మనం ఎప్పుడూ పేర్కొని మనకు మిగిలి ఉన్న కవులు స్వతంత్ర అస్తిత్వం కోసం కాకుండా సమాజం కోసం రాశారు.విప్లవ సాహిత్య ఉద్యమం ఒక ప్రధానమైన పాయగా మిగిలింది.తెలంగాణ సంభాషణ కొనసాగించటం 1970 ఆ తర్వాత 1980 తర్వాత 1990 దాకా సాగింది.1970 సంవత్సరం కి వచ్చేసరికి పాట ఊపు అందుకున్నది.తెలంగాణ వర్తమాన ముఖచిత్రం సాహిత్యంలో కనబడుతుంది. 1973-1974 గద్దర్ రాసిన పాటలు అంతే శక్తివంతమై ఉన్నాయి.మలిదశలో సాహిత్యకారులు గొంతునివ్వటం తర్వాత 1990 తర్వాత సామాజిక దశలలో సాహిత్యకారులు గొంతు నివ్వటం సామాజిక ఉద్యమ మార్గదర్శకులుగా సంభాషించారు. తెలంగాణ ఆకాంక్షలకి వర్తమానం ఎప్పుడూ దూరం కాలేదు. వందలాది పాటకారులు గాయకులు వచ్చారు. సాహిత్య సాంస్కృతిక వికాసమాన్నంతగా గొప్ప ప్రయత్నం జరిగింది. తెలంగాణ కల సహకారం అయింది. వర్తమాన సంభాషణ కొనసాగాలంటే పునరావిష్కరణ చేసుకోవాలి. వ్యాఖ్యానించుకోవాలి. ఏం సాధించామో స్థిరీకరించుకోవాలి.ఆదాన ప్రధానాలు చేసుకోవాలి. విస్తరించుకోవాలి. తన సాహిత్యం తనతో చేసుకునే సంభాషణకు ఇవి గీటు రాళ్లు.తెలంగాణ ఒక భాష అనుకుంటున్నాం. ఒక నిఘంటువు ఉండాలి. నిఘంటువు నిర్మాణం జరగలేదు. సమిష్టి ప్రయత్నం జరగలేదు. ఎవరైనా ఆమోదించగల ప్రామాణిక చరిత్ర అవసరం.తెలంగాణలో కవిత్వం బాగా వచ్చింది. ఎంతవరకు తెలంగాణతో సంభాషిస్తున్నది... సంభాషించింది? ఈ 10 , 12 ఏళ్లలో నవల లోకి ప్రవేశం కలిగింది.30 నవల వచ్చాయి.ఆత్మ కథలు వచ్చాయి.శంకర్ ఆత్మకథ వచ్చింది. జీవిత కథను నవలగా చెప్పటం జరిగింది. ఇదే సంభాషణం అంటే. ఇటీవల కాలంలో ఉత్సవాల పేరిట లీటరరీ ఫెస్ట్ జరుగుతున్నాయి. సాహిత్యకారులు తమతో తాము సంభాషించుకుంటున్నారు సాహిత్య సంభాషణ చలనశీలతను కోల్పోతున్న చోట చర్చించుకోవాలి. కొత్త తరం అభివ్యక్తిని ఆదరించటం తో సంభాషణ కొనసాగుతుంది.ప్రతి మనిషి వ్యక్తీకరణ హృదయం గౌరవించాలి. చర్చించాలి సత్యం నెగ్గ తేలాలి . అప్పుడే సంభాషణ అవుతుంది . గోల్కొండ పత్రిక 100 సంవత్సరాల సంభాషణ మిగిలి ఉన్నది అని ఉపన్యసించారు.

మధ్యాహ్నం జరిగిన ఈ సభా సదస్సుకు ప్రముఖ రచయిత్రి తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల సభ్యులు గడ్డం సులోచన గారు వందన సమర్పణ చేశారు.

మూడవ సెషన్ లో మూడు విడతలుగా కవి సమ్మేళనం జరిగింది.ఈ కవి సమ్మేళనం సాయంత్రం, నాలుగు గంటల నుండి ఆరుగంటల వరకు నిరాటంకంగా కొనసాగింది. ఈ సభ సమావేశానికి సిహెచ్ ప్రకాష్ కవి తెలంగాణ రచయితల సంఘం కార్యదర్శి గారు సభా ఆహ్వానం చేశారు. ప్రముఖ కవి తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల అధ్యక్షులు కందుకూరి శ్రీరాములు సభా అధ్యక్షత వహించారు. ఈ సభకు ఆత్మీయ అతిథులుగా డాక్టర్ తూర్పు మల్లారెడ్డి ప్రముఖ రచయిత పరిశోధకులు, డాక్టర్ జయప్రకాష్ తెలుగు భాషా చైతన్య సమితి గారు ఆత్మీయ సంభాషణ చేశారు.

కవి సమ్మేళనంలో

మాటలా పన్నెండేళ్ళ
తెరసం ఈ సభలు !
దశదిశలా విస్తరించె
సాహిత్యపు ప్రభలు !

సంఘాలెన్ని ఉంటేమి
తెరసం కే వీలువ !
చంద్రుడిలా రాగానే
విరిసినట్టు కలువ !

– కందుకూరి శ్రీరాములు

టుమ్రిలు ఒక ఆకర్షణ. తెలంగాణ రచయితల సంఘం ప్రయోజనాన్ని చెప్పారు. కందాళై రాఘవాచార్య, పొట్లపల్లి శ్రీనివాసరావు, శ్రీ రామోజు హరగోపాల్,డాక్టర్ చమన్,దాసరాజు రామారావు,రూప్ కుమార్ డబ్బీకార్, గడ్డం సులోచన,సిహెచ్ ప్రకాష్,సిహెచ్ , ఘణపురం దేవేందర్,ఉషారాణి.వాసర చెట్ల జయంతి,ధూళిపాల అరుణ,యరకల యాదయ్య, బిల్లా మహేందర్, గుండెల్లి ఇస్తారి, డాక్టర్ పోరెడ్డి రంగయ్య, కె నవీన్ కుమార్, నరేష్ చారి, డాక్టర్ పొన్నాల బాలయ్య, రుద్రంగి రమేష్, ఎం. రాజశేఖర్, పానుగంటి రామమూర్తి, డాక్టర్ జి డి రమేష్, సుప్పని సత్యనారాయణ, క్రాంతి కుమార్, గజవెల్లి దరరథ రామయ్య, పరిమి వెంకట సత్యమూర్తి, నక్క శ్రీనివాస్, అవుసలి ఆంజనేయులు, లోడే రాములు, అంకం మనోహర్, శ్రీశైలం, పొన్నం రాజయ్య, పి.గంగాధర్, రాములు చెందా, నల్లగొండ రమేష్, ఉప్పల పద్మ గుత్త' ప్రసాద్, గొరై అనిల్ కుమార్, లక్ష్మ య్య కవి, మొదలైన కవులు ఇతివృత్త వైవిధ్యం గల వర్తమాన కవిత్వం చదివారు. గుండెల్లి ఇస్తారి కవి సమ్మేళనం సభ అనంతరం వందన సమర్పణ చేశారు. కవి సమ్మేళనం తర్వాత జరిగిన జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలోనే తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పొట్లపల్లి శ్రీనివాసా రావును ఎంచుకున్నారు.

డా.బెల్లంకొండ సంపత్ కుమార్

కాల చక్రంలో రేపటి వెలుగు

కాలం కలిసొస్తే కన్నీటి చుక్కలే కలువలై వికసిస్తాయి,
విధి వేసిన సంకెళ్లే విజయానికి సోపానాలై నిలుస్తాయి.
చీకటి ఒడిలో చిక్కుకున్న ఆశలే చుక్కానిలా మెరుస్తాయి,
ఎండమావుల వెంట అలసిన అడుగులకు వసంతాలు ఎదురొస్తాయి.
నిన్నటి గాయాలే నేటి గెలుపులకు గీతోపదేశాలవుతాయి,
మౌనంగా రాలిన కన్నీళ్లే మణిముత్యాలై చరిత్రలో నిలుస్తాయి.
రెక్కలు విరిగిన పక్షికైనా రేపటి ఆకాశం దారినిస్తుంది,
ఎండిన నేల గుండెలోనైనా తొలి వాన చినుకు ప్రాణం పోస్తుంది!
కాలం కరుణిస్తే మట్టిలోని విత్తనం మహావృక్షమై ఎదుగుతుంది,
అదృష్టం తలుపు తడితే అనాథ ఆశలకూ ఆత్మీయత దొరుకుతుంది.
నిన్న అవమానించిన లోకమే నేడు నీ విజయానికి జేజేలు పలుకుతుంది,
వెలుగుల కోసం ఎదురుచూసిన బతుకులో వెన్నెలే వాకిలి తొక్కుతుంది!.
అయితే కాలం కలిసొచ్చిందని కాలికి నేల విడువకు,
కలిమి కొగిలించిందని కన్నీటి బంధాలను మరువకు!.
కాలం పెట్టే పరీక్షల్లో కుంగిపోకు, కలల దీపాన్ని ఆర్పుకోకు,
ఓటమి ఒడిలో ఒదిగినా నీ ఆత్మవిశ్వాసాన్ని వదులుకోకు!.
కాలం కలిసిరావడం వరమైతే, దాన్ని సద్వినియోగం చేసుకోవడం వివేకం,
కాలంతో పాటు నడవడం విజ్ఞతైతే, ఎదుటివారిని నిలబెట్టడం మానవత్వం.
కాలం కలిసొస్తే బతుకు బంగారమవుతుంది..
మనసు మంచిదైతే ఆ బంగారమే పదిమందికి వెలుగవుతుంది.

-నల్లి సాయి బాబు తెలుగు అధ్యాపకులు
సీతారామ పురం

కణిక

సాహిత్యం, సామాజిక సేవ,
విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
'బుధవారం బాద్షా'
పోటీ ఫలితాలు

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ
95021 56813

అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

ఆరు కాలాల ఋతురాగమే

కాలం కలిసొస్తే....
కలల ప్రపంచమంతా
రంగుల మయమే
నెరవేరని ఆశల శిశిరాలు
చిగురులు తొడిగిన వసంతమై
ఎద కోయిల మధురంగా
గాన కచేరిలు చేస్తుంది.
వడగాలుల నిట్టూర్పులతో
వేసారి బీటలువారిన
హృదయాలపై ఓదార్పుల
చల్లని శ్రావణ జల్లుల
స్వాంతన కురుస్తుంది.
చీకటి కోటలతో
కప్పబడిపోయిన మదిగోడలపై
శరత్కాల వెన్నెల వెలుగులు
తారాడతాయి.
ఓటమెరుగక అపజయాల
పరంపరతో ఘనీభవించిన
జీవితాన్ని విజయాల తుషార
బిందువులు మురిపించి
మైమరపిస్తాయి
కలిసొచ్చిన కాలం
ఆరు కాలాల ఋతురాగం
పాడుతుంది.

-కొలచన విజయ భారతి
నార్త్ కెరోలినా,అమెరికా
(ప్రస్తుతం)

రేపటి భవిష్యత్తు మన చేతుల్లోనే

పసిఫిక్ మహాసముద్రానికి మరి జ్వరం వచ్చిందంటా
ఆ సముద్రంలోని నీళ్లేమో వేడిగా అయ్యాయంటా
మరి మనిషి శరీరం వేడిగా అయితే జ్వరం అంటాం కదా
సముద్రానికి వేడిగా ఐతే ఏమంటాం మరి?.
ఈ చక్కని చిక్కు ప్రశ్నేమో నా కూతురి బుర్రలో మెరిసింది
వైజ్ఞానిక ఈ ప్రశ్నకు నా సమాధానాన్ని అడిగింది
రెండు నుండి ఏడేళ్ల మధ్యలో సముద్ర ఉష్ణోగ్రత మారునని
దాని వల్ల వాతావరణంలో మార్పులు జరుగునని.
విషయం చెప్పినా కూడా నను సందేహంగా చూస్తూనే,
అప్పుడు ఇప్పుడు ఉష్ణోగ్రతలలో చాలా మార్పులు వచ్చాయి.
మునుపటికంటే ఇప్పుడు ఎందుకు ఉష్ణోగ్రత పెరిగిందంటూ
దానికి నువ్వు ఏమంటావని నా సమాధానమే కోరింది.
ప్రకృతి మార్పులకు తోడుగా మానవ తప్పిదం కలిసింది,
హరితగృహ వాయువుల పెరుగుదలతో భూమేమో వేడెక్కింది.
భూమిలో పెరిగిన ఈ వేడిని సముద్రం తాను గ్రహించింది
ఆ వేడిమి పెరుగుదల ప్రకృతిపై ప్రభావం చూపిందని చెప్తే.
అవునా అంటూ ఆశ్చర్యంతో ఆ ప్రభావమేంటని అడిగింది
ఉష్ణోగ్రతల పెరుగుదలతో ఆరోగ్య సమస్యలు వచ్చునని
వర్షాలు రాక, నీళ్లు లేక, వ్యవసాయ మార్పులు జరుగునని
నీటి ఎద్దడి, విద్యుత్ కొరతతో సమస్యలెన్నో వచ్చుననంటే.
నాన్న, దీనికి పరిష్కారము చెప్తే బాగుంటుందంటూ
అందరూ బాగుండాలంటే,కడుపు నిండా తినాలంటే
ఈ సమస్య నుండి బయటపడి ఆనందంగా ఉండాలంటే
ఏంచెయ్యాలో వివరించు అందరినీ ఉత్తేజిత పరచు.
మొక్కలు బాగా పెంచాలి, నీటి వృథాని ఆపాలి
తక్కువ నీటితో పండే పంటలు ఎంచుకుని పండించాలి
సూర్యశక్తిని, వాయుశక్తిని వాడుట ఇంకా పెంచాలి
ఆరోగ్యం పరిరక్షించుకుంటూ ఆర్థిక క్రమశిక్షణ నేర్వాలి.
కాలం కలసి వస్తే ,మనిషి తీరులో మార్పులు తెస్తే
ప్రకృతిని ప్రేమిస్తూ మనిషి ఆనందంగా జీవిస్తే
ఆహార,నీటి, విద్యుత్ వృథాలు ఆపటానికి అడుగేస్తే
భావి తరాలకు బంగారం లాంటి భవిష్యత్తును అందిద్దాం.
వాతావరణ చక్రాలు నిరంతరం మారుతుంటాయి
సముద్రాన్ని ఎల్లినో వేడిక్కిస్తే లానినో చల్లబరుస్తుంది
ప్రకృతి ఎపుడూ తనకు తానుగా పునరుజ్జీవనమవుతుంది
కష్టనష్టాలు ఎదుర్కుంటూ, పాఠాలను నేర్చుకుంటూ ఆనందంగా జీవిద్దాం.


- శ్రీవాణి సుకన్య

కాలమే కల్పతరువు

కాలం కలిసొస్తే...
ఎడారి కూడా అమృత సరస్సవుతుంది,
నిశీధి నిట్టూర్పుల నడుమ వెలుగురేఖ శ్వాసిస్తుంది,
నిశ్శబ్దం కూడా వేదమంత్రమై మ్రోగుతుంది.
కాలం కలిసొస్తే...రాలిన ఆకుల రాగమే వసంత గీతమౌతుంది,
మూగబోయిన గొంతులో మౌనమే మహాకావ్యమౌతుంది,
నీడలే దీపమై దారి చూపుతాయి.
కాలం కలిసొస్తే...కన్నీటి చెలమలో కలువలు విరబూస్తాయి,
ఓటమి ఒడిలోనే గెలుపు పసిపాపలా నవ్వుతుంది,
బీటలు వారిన నేల పైర్ల పట్టుచీర కట్టుకుంటుంది.
కాలం కలిసొస్తే...అది ఒక కటిక చీకటిలో కమ్మని కలల దొంతర,
అది ఒక శిశిరపు శాఖపై కోయిల కూసిన తొలి స్వరం,
అది ఒక శూన్యపు గుండెలో మోగిన వేణు నాదం.
కాలం కలిసొస్తే చాలు ...మనసున్న మనిషే దైవమౌతాడు,
కరిగిపోయే క్షణమే యుగమౌతుంది,
అరచేతి రాతలే ఆకాశపు లిఖితమౌతాయి.

-నరహరి రావు బాపురం
అనంతపురము

నూతన ప్రక్రియల రథసారథి - డా. బి.వి.ఎన్. స్వామి



కథారచయిత, విమర్శకులు, విశ్రాంత ఉపాధ్యాయులు గొప్ప పరిశోధకులు బి.వి.ఎన్.స్వామి గారు . తెలుగు సాహిత్యంలో నూతన ఒరవడికి ఆయువుపట్టు స్వామి గారి ఆలోచనలు. బి.వి.ఎన్ స్వామి పూర్తి పేరు భైరవి వెంకట నరసింహస్వామి. స్వామి తల్లిదండ్రులు లక్ష్మీదేవి, అనంతస్వామి. రెండు దశాబ్దాల పైచిలుకు కాలంగా సాహిత్యానికి సేవ చేస్తున్న రచయిత బి.వి.ఎన్ స్వామి. స్వామి గారు రాసిన రచనలు డనబీనీబి;ఉత్తర తెలంగాణ కథా సాహిత్యండనబీనీబి; పై పరిశోధన చేసి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యా లయం నుండి పిహెచ్డి పట్టా అందు కున్నారు.

"అందుబాటు" అనే పుస్తకం ద్వారా కథా రచయితలను పరిచయం చేసి , భావి పరిశోధకులకు బాటలు వేశారు. కథలపై పరిశోధనలు చేసిన తరువాత కథలు విరివిగా రాసి "నెలపొడుపు" "రాత్రి పగలు ఒక మెలకువ" అనే కథా సంపుటాలను వెలువరించారు. అలాగే విమర్శవ్యాసాలు రాయడంలో స్వామి గారు దిట్ట. కావున ''వివరం'' ''కథ తెలంగాణ'' అనే కథావిమర్శ వ్యాసానం పుటాలు ప్రచురించారు. అవే కాకుండా

పటువ, కాలిబాటలు , కథ సోపా నాలు, పి.వి. నరసింహారావు, కరీంనగర్ జిల్లా సాహిత్య చరిత్ర లాంటి రచనలు రాశారు. మిత్రులతో కలిసి వది పుస్త కాలకు సంపాదకత్వం వహించిన రచ యిత స్వామి గారు. ఈ సాహిత్య సేవకు గాను తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం నుండి మొదలుకొని 13 ఉత్తమ పురస్కారాలను పొందారు.

కశప అనగా కథా శతక పద్యం అని అర్థం. కశప-1 పుస్తకం 2017లో ప్రచురించబడింది. ఈ పుస్తకాన్ని రచయిత సహధర్మచారిణి అయిన జయకు అంకితం ఇచ్చారు. ఇందులో మొదటిది "గుడి "అనే శీర్షికతో కథను రాసి,మల్లికార్జున పండితా రాధ్యుడు రచించిన శతకం శివతత్వసారము నుండి పద్యమును తీసుకొని ప్రారంభిం చారు. ఈ పుస్తకంలో చివరిది 117వది "వేడుక" శీర్షికతో కథను రాసి దానికి తగినట్లుగానున్న తెలంగాణ శతకం, పద్యభారతి నిజామాబాద్ వారి పద్యము ను తీసుకున్నారు. కథల్లో కల్పిత పాత్ర "బుంగిని" సృష్టించి కథల్లోని సంఘట నలకు, ఎత్తుగడకు

సందర్భానుసారంగా బహుకోణాలలో కథకునికి సహాయంగా ఈ పాత్ర ఉ

పయోగపడింది.

అయితే కశప-1 పుస్తకంలో కథకు

అనువైన పద్యాలను శతక కవులు రాసిన పద్యాలనుండి తీసుకు

న్నారు . కశప-2 పుస్తకం

2025 సంవత్సరంలో ప్రచురిం చబడింది. ఈ పుస్తకాన్ని రచయిత మనుమరాలు యష్టికకు అంకితం ఇచ్చారు. ఇక్కడ చెప్పుకునే విషయం ఏమిటంటే కశప-2 బాల సాహిత్యమునకు ఈ పుస్తకం పరిపుష్టి చేసింది. పిల్లలు కథతో పాటుగా పద్యం కూడా చదివి నేర్చుకుం టారు. మొదటి కశప-1 పుస్తకంలో పద్యం వేరే కవిది.

కథ మాత్రం స్వామి గారు రాశారు. కశప-2 పుస్తకంలో కథ మరియు పద్యం కూడా స్వామి గారే రాసారు. ఇందులో తేట గీతి ఉపజాతి ఛందస్సులో గల పద్యాన్ని ఎంచుకొని పాఠకుడికి చక్కగా అర్థమయ్యే రీతిలో చిన్న కథలతో బుంగి పాత్రతో బోధించారు.

"కశప చెప్పిన కథనమ్ము కాంతి పథము"

అను ఏకపాద మకుటంతో పద్యాలు రాసారు. దీనిలో మొదటి కథ "మిగులు" అనే శీర్షికతో మొదలుపెట్టారు. పద్యములో మూడవ పాదములో పదమును శీర్షికగా స్వీకరించి కథలను రాసారు. చివరిది 108వది "తెలిపిన" అనే శీర్షికతో కథ మరియు పద్యం రాసి పూర్తి చేసారు.

తెలుగు సాహిత్యంలో అనేక రకాలైన ప్రక్రియలు నూతన ధోరణులు మొగ్గ తొడుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే కొంగొత్త మార్గానికి దారి చూపిన పరిశోధకులు డా.బి.వి.ఎన్ స్వామి గారు. పద్యం రాయలేను పాట పాడలేను అనుకున్న రచయితే తన కథల్లో మాత్రం తనకి ఇష్టమైన చిన్న పద్య పాదమో,పాటలోని రెండు చరణాలను సందర్భానుసారంగా రాస్తారు. కావున అలాంటి ఇష్టాలు పద్యాలలోని నీతిని బట్టి కథను,కథను బట్టి పద్యాన్ని రాసే ఆలోచన కార్యరూపమే కశప. రెండు తెలుగు రాష్ట్రాల నుండి శతకాలను సేకరించారు. రచయిత కథలకు అనుగుణంగా ఉన్న పద్యాలను తీసుకున్నారు. కాని కశప-1లో 117 పద్యాలకు కట్టుబడటంతో అన్ని శతకలలోని పద్యాలను తీసుకోలేక పోయారు.ఎందుకంటే....పద్య సాహిత్యం విస్తృతమైంది కదా..! ఎన్ని పద్యాలు చదివితే ఈ మేలిమి లాంటి ఆణిముత్యాలను ఎంపిక చేసుకోవడానికి,కథకు తగినట్లుగా స్వీకరించడానికి రచయిత ఎంత శ్రమపడి ఉంటారో మనం అర్థం చేసుకోవచ్చు. అలాంటి కశప -1 నుండి మచ్చుకు కొన్ని పరిశీలిద్దాం.

"ఒడలు గుడి యంతరాత్మయ
ఒడరుండను పలుకు లుడిగి భక్తిని గుడియే
గుడియనియు లింగమూర్తియ
ఒడరుండని కొలువకునికి పాతకము శివ!"

మల్లికార్జున పండితారాధ్యుడు రాసిన శివతత్వసారము శతకం నుండి తీసుకో బడింది. **"గుడి"** అనే శీర్షికతో కథను రాసారు. కథ ఇతివృత్తానికి తగినట్లు పద్యమును ఎన్నుకున్నారు. ఈ కథలో ఒక సామాజిక వర్గం తమకు ప్రత్యేకంగా గుడిని నిర్మించుకోవాలనే సంకల్పంతో ఎదుర్కొన్న కష్టాలను, సంఘటిత పోరాటాన్ని వివరిస్తుంది. గుడి నిర్మాణానికి స్థలం సంపాదించడం, నిధులు సమకూర్చడం, నిర్మాణాన్ని ప్రారంభించడం వంటి దశల్లో అనేక అడ్డంకులు ఎదురవుతాయి. కొందరి సహకారం లభించినప్పటికీ, మరికొందరి నిర్లక్ష్యం, అంతర్గత విభేదాలు, ఆర్థిక ఇబ్బందులు నిర్మాణానికి ఆటంకాలుగా నిలుస్తాయి. అయినప్పటికీ సంఘం నాయకత్వం వెనుకడుగు వేయకుండా సభ్యులను ఏకతాటిపైకి తీసుకువచ్చి, తమ ఆధ్యాత్మిక అవసరంతో పాటు సామాజిక ఐక్యతను కూడా కాపాడుకోవాలని ప్రయత్నిస్తుంది. మొత్తం మీద ఈ అంశం సామూహిక సంకల్పం, ఐక్యత, పట్టుదల, సామాజిక చైతన్యం ఉంటే ఎన్నో అవరోధాలను అధిగమించవచ్చనే సందేశాన్ని అందిస్తుంది.

"ఇంచుకంత బోన మీశ్వరార్పణమన్న
పుణ్యలోకమునకు పోవునతడు
అన్నదానమునకు నధిక దానము లేదు
విశ్వదాభిరామ వినురవేమ";


అన్నదానము అనే శీర్షికతో కథను రాసారు.కథకు తగినట్లు "వేమన శతకం" నుండి పద్యాన్ని తీసుకున్నారు. కళాశాల కార్యక్రమంలో మతం, నైతికతలపై జరిగిన ఉపన్యాసం రచయిత మనసులో అనేక అనిశ్చితులను, సందేహాలను రేకెత్తించింది. ఆ సంక్లిష్ట భావనల నుండి బయటకు వచ్చి వంట ప్రాంగణానికి వెళ్లిన రచయిత, అక్కడ జరుగుతున్న అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు, పక్తలు, సందర్శకులు అందరూ తృప్తిగా భోజనం చేయడం చూసి ఆయన తీవ్రమైన మానసిక ప్రశాంతతను, హాయిని పొందారు .కేవలం సిద్ధాంత ప్రసంగాల కంటే ప్రాణుల ఆకలి తీర్చే ఈ మానవీయ ఆచరణే నిజమైన ధర్మమని బుంగి గ్రహించాడు.

''బ్రతుకు నిచ్చేటి బ్రతుకమ్మ ప్రతిగృహమున
గునుగు తంగేడు విరులతో గూర్చి పేర్చి
వీధి వీధి నూరేగించి వేడ్కగొనగ
నా తెలంగాణ కోటి రతనాల వీణ"

వేడుక పదమును శీర్షికగా తీసుకొని కథను రాశారు.శీర్షికకు తగినట్లు పద్యాన్ని తెలంగాణ శతకం పద్య భారతి నిజామా బాద్ నుండి తీసుకున్నారు. ఈ పద్యంలో బతుకమ్మ పురాణ శక్తికి ప్రత్యేకగా రంగులు వెదజల్లే శివశక్తిగా మారి పసుపు గౌరమ్మలోని దైవ శక్తిగా తొమ్మిది రోజులు తెలంగాణ రాష్ట్ర ప్రజలంతా కొలిచే పండగ గురించి కథను అల్లినారు.

కశప-2 పుస్తకం నుండి కొన్నిటిని చూద్దాం

''దిగులు మననుకు ముచ్చటే దిక్కునెపుడు



పెరుగుచున్నను మానసం పెరగవలెను
అప్పుడె సంపూర్ణ మనిషిగ నందగించు
కశప చెప్పిన కథనమ్ము కాంతి పథము"

బాల్యంలో బుంగి ఎంతో ఆశగా నిర్మించుకున్న ఇసుక గూడు పక్షి వెక్కిరిం తతో నాశనమైంది. పెద్దయ్యాక పేరుగాం చిన నటుడైనప్పటికీ, లోపలి శూన్యతను పూడ్చుకోవడానికి బుంగి మద్యానికి బానిసయ్యాడు. తన మనసులో కొలువుదీ రిన వయ్యారి పిచ్చుక కోసం ఎంతో కాలం శ్రమించి ఒక "మనసు మహల్"ను నిర్మిం చాడు. అయితే ఆ అందాల పిచ్చుక మహల్

లోపాలను వెతుకుతూ దానిని తిరస్కరించి,అతని మనస్సుపై తీవ్రమైన దెబ్బతీసి ఎగిరిపోయింది. బాహ్య సౌందర్యం మరియు అశాశ్వతమైన ఆశలు నిజమైన ఆనందాన్ని ఇవ్వలేవని, చివరకు మనోవే దననే మిగులుతాయని కథ మరియు పద్యంతో తెలిసింది

"పరులకును జేయు సేవకు పరిధి లేదు
ఎంత చేసిన వెనుకన నెవరు రారు
ఇన మరుపక చేయుట హాయి నిచ్చు
కశప చెప్పిన కథనమ్ము కాంతి పథము"

స్వార్థం లేని సమాజసేవ ఇతరులకు సాయపడే గుణాన్ని ఈ కథ ఎంతో చక్కగా ఆవిష్కరించింది. కాలం, మనుషులు మారుతున్నా తండ్రి చేసే మంచి పనులను ఊరివారు విమర్శించి నప్పటికీ, కొడుకు గుర్తించి మద్దతు ఇవ్వడం

ఈ కథలోని ముఖ్య ఘట్టం. తన కొడుకు కొండంత అండగా నిలవడంతో **"బుంగి"** పొందిన ఆనందం మరియు సంతృప్తి తండ్రీకొడుకుల ప్రేమానురా గాలకు అద్దం పడుతోంది.

"మానవ సంబంధాలు, సేవానిరతి,
కుటుంబ మద్ధతుడనబీనీబి;యొక్క ప్రాధాన్యతను చాటి
చెప్పే చక్కటి సందేశాత్మక కథ.
డనబీనీబి;చిట్టిపొట్టిన మాటల చిన్ని ముద్దు
బుంగమూతి యలకలున్న బుంగి ముద్దు.
ఘల్లు ఘల్లున తిరిగెడి గజ్జె ముద్దు
కశప చెప్పిన కథనమ్ము కాంతి పథము"

పద్యంలోని మూడవ పాదంలో "గజ్జె" అనే పదంతో రచయిత కథను రాసారు.ఈ కథ కుటుంబంలో పెరుగు తున్న నిశ్శబ్దాన్ని, మనుషుల మధ్య తగ్గిపోతున్న ఆత్మీయతను సున్నితంగా ప్రతిబింబిస్తుంది. చిన్న సంఘటన ద్వారా ఇంట్లో ప్రేమ, అనుబంధం, సంభాషణ ఎంత అవసరమో రచయిత చక్కగా ఆవిష్కరించారు.సరళమైన కథనశైలిలో సామాజిక వాస్తవికతను, మానవ సంబంధాల విలువను చాటి చెప్పిన కథ.

"అన్ని దానాల కన్నను నవయ వములు
దానమిచ్చుట మిన్నయౌ తరచిచూడ
బతికి బతికించు వాడౌను భవ్యజీవి
కశప చెప్పిన కథనమ్ము కాంతి పథము"

ఈ కథ వైద్యరంగంపై ఆసక్తి ఉన్న ఓ వ్యక్తి సేవాభావంతో అవయవ దాన ఉద్యమానికి అంకితమైన తీరును వివరిస్తుంది. అవయవదానం ద్వారా మ రణించిన వారి అవయవాలతో ఎంతో మంది జీవితాల్లో వెలుగు నింపవచ్చని తెలియజే స్తుంది. శరీరదానం, నేత్రదానం, అవయవదానం ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లే సందేశం కథలో ప్రధానంగా కనిపిస్తుంది .మాన వత్వం, సేవాభావం, ఇతరుల ప్రాణాలను కాపాడాలనే బాధ్యతను ఈ కథ చక్కగా ప్రతిబిం బిస్తుంది.

"ఎన్ని బతుకులు కాలెనో యేవరికె రుక
దినదినమ్మున ప్రజ గుండె దిగ్గురనగ
కోపశమున కూలేను కోట గడులు
కశప చెప్పిన కథనమ్ము కాంతి పథము."

పిట్టలు పట్టడానికి రాళ్ళగ ఎక్కి జారిపడటంతో నడుము విరగ్గొట్టుకున్న బుంగి అనే వ్యక్తి ప్రమాదంతో ఈ కథ ప్రారంభమవుతుంది.నిజాంల కాలంలో తెలంగాణలోని గడీలు దొరలు, దేశ్ముఖ్ల అధికారానికి, భూమిశిస్తు వసూళ్లకు మరియు విలాసవంతమైన పాలనకు కేం ద్రాలుగా ఉంటేవని రచయిత వివరిం చారు. ఒకప్పుడు చారిత్రక వైభవానికి ఆనవాళ్లుగా నిలిచిన ఈ పెద్ద పెద్ద రాతి కోటలు కాలక్రమేణా ప్రస్తుత సమాజంలో ప్రమాదకర ఆనవాళ్లుగా మిగిలాయని ఈ ఘటన చూపుతుంది. చారిత్రక కట్టడాలు కేవలం గతానికి పరిమితం కాకుండా వర్తమాన జీవితాలను కూడా ప్రభావితం చేస్తాయని బుంగి ప్రమాదం ద్వారా ఈ కథ సారాంశాన్ని తెలియజేస్తుంది.

ఏదైనా కొత్త ప్రయోగం చేయాలంటే డా.బి.వి.ఎన్ స్వామి గారికే చెల్లుతుంది. చిత్రాలను చూసి కథ చెప్తారు, కవిత్వం రాస్తారు. ఇది మన అందరికి తెలిసిందే కానీ స్వామి గారు నూతన ధోరణి ఎంచుకొని రచయిత రాసిన కథలకి శతకాలలోని పద్యాలను తీసుకోని రెండు ప్రక్రియలా సారాంశం ఒకేచోట పాఠకుల కు అందిచడం నిజంగా గొప్ప విషయం. విమర్శకులు విన్నవించుకోవచ్చు అదేం పెద్ద పని...? అని ఉన్న పద్యాలకు కథను చెప్పడం అది ఓ పెద్ద విశేషమా...! అని అనుకోవచ్చు. అట్లాంటి ప్రశ్నలకు సమాధానంగా కథ మరియు పద్యం రాసి కశప-2 ను ప్రచురించి తన ప్రతిభను నిరూపించుకోవడం స్వామి గారి బుద్ధి కుశలతకు నిదర్శనం. నిజానికి స్వామి గారు చాలా సౌమ్యులు. కొత్తగా సాహిత్యం లో వచ్చే వారికి, పరిశోధకులకు స్వామి గారి రచనలు ఎంతగానో ఉపయో గపడతాయి. స్వామి గారు సాహిత్యంలో వేసిన అడుగులు ఎప్పటికీ ప్రత్యేకమే. ఇలాంటివి స్వామి గారు ఇంకా మరెన్నో తెలుగు సాహిత్య ప్రక్రియలో విభిన్న ఆలోచనలతో ప్రయోగాలకు దారి చూపాలని ఆశిస్తూ....రచయితకు అభినందనలు.



-డా॥ముత్యంపేట గంగాధర్
సెల్: 9704118352



ఫేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా॥ రావి రంగారావు వారం వారం సాహిత్యం వర్క్ షాపులు నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు. ఈ వారం వచన కవితల వర్క్ షాప్... అంశం "మహాకవి". విజేతల కవితలు చదవండి.

-సంపాదకులు

-డా॥రావి రంగారావు
9247581825

మహాకవి

మహా కవి
విశ్వంలో వెలిగే రవి,
కాలం చెప్పే పాఠాలకు నిజం
నిగ్గు తేల్చే
అక్షర గురువు...
హృదయాన్ని ద్రవించి
మనసును కదిలించి
మనిషిని చైతన్య పరిచి
మానవత్వానికి మార్గం చూపి
కవిత్వమై కదిలే సాహితీ స్రవంతి...
మహా కవి
మాటల శూరుడు కాదు,
అక్షర సైనికుడు...
అక్షర తూణీరాలతో
అవినీతి అరాచకాలపై
యుద్ధం చేసే సాహసి...
భౌతిక నైరూప్య
ప్రకృతి స్థితి లయలను
పద బంధం చేసి
సాహితీ రస రమ్యాన్ని
రసికులకు అందించే
కవి సార్వభౌముడు...
స్వరాలకు
అక్షర భావాలు సంధించి
అనంత రాగాల పల్లకిలో
జీవింపజేసిన
సాహితీ మనో రంజకుడు...
తనువు మరచి మనసు తెరిచి
భావాల గనిని తవ్వి తవ్వి
కావ్యాల రాశి పోసి
సమాజంలో వెదజల్లితే
ప్రతి గుండెలో చైతన్యం మొలకెత్తితే..
ఏనుగు అంబారీలు కీర్తి కిరీటాలు
గండె పెండేరాలు
ఆహ్వానం పలుకుతాయి,
కిరీటం లేని మహారాజే మహాకవి,
మహా కవి
మనీ మనిషి కాదు
మహా మనిషి...

-పగడాల వెంకటరెడ్డి
7993422614

మహాకవి


ఊహలకు రెక్కలు తొడిగి,
చిక్కుబడిన మనసుల ముడులు విప్పి
మనసుకు ఊతమిచ్చేవాడు మనసు కవి.
ప్రేమను కోరి, ప్రేమను కొసరి,
ప్రేమామృతంతో హృదయ అభిషేకం చేసేవాడు ప్రేమ కవి.
ఆలోచనకు భావాల రంగులద్ది,
ఆలోచనకు సత్యాల బాటను చూపి
ముందుకు నడిపించేవాడు ప్రగతి కవి.
అబద్ధపు ముసుగులను కరిగించి,
విలువలేని విలువలను కడిగి
నిజాలు వెలిగించేవాడు నిర్మల కవి.
కంటికి కనిపించని ద్వంద్వ సమాజపు
దాస్యపు సంకెళ్ళను, అవినీతిని,
కలంతో తెంచేవాడు కర్తవ్య కవి.
అక్షరాలను బ్రతుకు రంగులలో ముంచి,
జీవిత శిల్పాన్ని కళ్ళకు కట్టేవాడు ఆవిష్కర్త కవి.
కనిపించని రాగాలను వినిపించి,
హృదయ రాగాలకు లయనిచ్చి
సమతను పంచేవాడు సమతా కవి.
మానవ హితమే
ధ్యేయంగా సాగే సమాజ యజ్ఞంలో
మనిషిని మనిషిగా మార్చే
విశ్వ ప్రయత్నం చేసేవాడు విశ్వకవి.
ప్రజల బాధలు, సంతోషాలు తనవిగా తలచి,
అందరి కోసం ఆర్తితో,
భవ్య సమాజానికి వెలుగులు నింపేవాడు ఆత్మకవి.
కవులకున్న కళ్ళు, కాళ్ళు, చెవులు,
చూపు అందరివై,
అందరి హృదయాల్లో సజీవంగా,
ఉండిపోతారు మహాకవులు.

-కోమల సత్యవతి
9989963383

భావ కవితా యుగ కర్త దేవులపల్లి కృష్ణ శాస్త్రి

దేవులపల్లి తన బాధ ప్రజల బాధగా ప్రేమ విరహం అంశాలు గా రచన చేశారని ప్రముఖ సాహితీ వేత్త చలం చెప్పిన మాటలు గుర్తు చేశారు అధ్యక్షత వహించిన గాన సభ

హైదరాబాద్, నవంబర్ 4:గురజాడ అప్పారావు అభ్యుదయ సాహితీ యుగ కర్త కాగా రాయప్రోలు సుబ్బారావు భావ కవిత్వ యుగ కర్త ఆయనను అనుసరించి ప్రముఖ సాహితీ వేత్త చలం చెప్పిన మాటలు గుర్తు చేశారు అధ్యక్షత వహించిన గాన సభ



సభలో పాల్గొన్న అతిథులు

కొనసాగించిన వారు దేవులపల్లి కృష్ణ శాస్త్రి అని రాష్ట్ర హస్త కళల అభివృద్ధి సంస్థ నాయుడు సత్యనారాయణ చెప్పారు శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గాన సభ నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా దేవులపల్లి కృష్ణ శాస్త్రి జయంతి సమావేశం జరిగింది.

ముఖ్య అతిథిగా పాల్గొన్న నాయుడు సత్యనారాయణ మాట్లాడుతూ దేవులపల్లి కృష్ణ శాస్త్రి కృష్ణపక్షం కావ్యం భావ కవిత్వంను పతాక స్థాయి లో నిలిపింది అని వివరించారు మహా కవి శ్రీశ్రీ ప్రజల బాధ తన బాధగా సాహిత్య రచన చేస్తే అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ కృష్ణ శాస్త్రి సినీ పాటలు సాహిత్య గుబాళింపు లనీ ముఖ్యంగా జయ జయ భారత జాన యత్రీ, ఆకులో ఆకునై వంటి గీతలు ఎవర్ గ్రీన్ అని చెప్పారు. సాహితీ కిరణం సంపా దకుడు పొత్తూరి సుబ్బారావు గాయకుడు నుబ్రహ్మణ్యం గాయని రత్నమాల పాల్గొన్నారు.



జయంతి పబ్లికేషన్స్ నిర్వహణలో జరిగిన

'సాహితీ సప్తకమ్' విజయవంతం

'పు'స్తక ప్రచురణ- సాహిత్య కార్యక్రమాల నిర్వహణ- తెలుగు సాహితీసేవలో రెండున్నర దశాబ్దాల పరంపర' కలిగి- తెలుగు సాహిత్యానికి 26ఏళ్లుగా విశిష్ట సేవలు అందిస్తున్న 'జయంతి పబ్లికేషన్స్' సంస్థ 'శ్రీ త్యాగరాయ గానసభ' సౌజన్యంతో హైదరాబాద్ నగరంలో "సాహితీ సప్తకమ్" పేరిట **26 అక్టోబర్ 2026 నుండి 01 నవంబర్ 2026** వరకు "7రోజుల బృహత్తర సాహిత్యోత్సవం" నిర్వహించింది.

'సాహితీ సప్తకం'లో **1వ రోజు సోమవారం 26న** యువ రచయిత శ్రీ సురేష్ మందల, బి.ఎఫ్.ఏ. రచన **'అతుకుల గుడిసె'** (రాయలసీమ మాండలికంలో రాయబడిన నవల) లోకాంకిత మహోత్సవం జరిగింది.

సభా ప్రారంభానికి ముందు **'కులవివక్ష'** అంశంపై నిర్వహించిన కవిసమ్మేళనం సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



మొదటి రోజు "అతుకుల గుడిసె" నవలను ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్. వేదికపై స్వయంప్రభ, ఎన్.లహరి, చిట్టే సిద్ధ లలిత, ఆచార్య కోయి కోటేశ్వరరావు, రచయిత సురేష్ మందల, యస్వీకృష్ణ, విజయ్ నయనాల, చొక్కాపు వెంకటరమణ.

ముఖ్య అతిథి గ్రంథావిష్కర్త పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ.. "బలహీనుల మీద బలవంతులు చేసే దారుణాలు, దుర్మార్గాలు ఈ నవలలో అకారణంగా చూస్తారు. ఈ దుర్మార్గాలను అట్టడుగు వర్గాలవారు ఎందుకు సహిస్తున్నారు? ఎందుకు ఇంతటి భయంకరమైన లొంగుబాటు, సర్దుబాటు, దాస్య స్వభావం?" అంటూ ప్రశ్నిస్తూ "ఎక్కడో తిరగబడినవాడు అంతమైపోతాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఒక సామాన్యుడు ఎలా బతికి బట్టకట్టి ఎదు గుతాడో ఈ నవలలో చూస్తారు" అంటూ వివరించారు.



2వ రోజున "500 అరనిమిషం కథలు" ఆవిష్కరిస్తున్న డా: దాసరి వెంకటరమణ. వేదికపై మల్లం రమేష్, యస్వీకృష్ణ, విశ్వైక, శంకర నారాయణ, చొక్కాపు వెంకటరమణ, డా: కందేపి రాణీప్రసాద్, పైడిమర్రి రామకృష్ణ, ఘాలి లలితాప్రవల్లిక.



3వ రోజున "ఆశల దోపిడి" పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జి. గణేష్. వేదికపై చొక్కాపు వెంకటరమణ, వందన, కాంచనపల్లి రాజేందర్ రాజు, రచయిత్రి అరుణా రవికుమార్, మల్లం రమేష్, యస్వీకృష్ణ, రమాదేవి కులకర్ణి, స్వయంప్రభ .

సభాధ్యక్షుడు ఆచార్య కోయి కోటేశ్వర రావు మాట్లాడుతూ.. సమాజంలోని యథార్థ పరిస్థితులకు అద్దం పడుతూ, ప్రాంతీయ మాండలికంలో వెలువడే నవలలు సాహిత్య రంగాన్ని మరింత సుసంపన్నం చేస్తాయని పేర్కొన్నారు.

విశిష్ట అతిథి గానసభ అధ్యక్షులు శ్రీ కళా వి.ఎస్. జనార్ధన మూర్తి మాట్లాడుతూ.. గానసభ వేదికగా 7 రోజుల పాటు 'సాహితీ సప్తకమ్' వంటి మహోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమని, యువ రచయితలను ప్రోత్సహించడంలో 'జయంతి పబ్లికేషన్స్' కృషి ప్రశంసనీయమని తెలిపారు.

ప్రత్యేక అతిథి విజయ్ నయనాల మాట్లాడుతూ.. సమాజంలో సాహితీ చైతన్యాన్ని పెంచేందుకు, ఆదరణ కరువై, నానాటికీ అర్థం మారిపోతున్న 'విమర్శా ప్రక్రియ'కు జవజీవాలు కల్పించాలని 'అతుకుల గుడిసె' నవలపై రూ.25,000/- నగదు బహుమతితో 'సమీక్షావిమర్శ వ్యాసాల పోటీ'ని మా వి.ఎన్.జి. సంస్థ ద్వారా నిర్వహించేలా చేసిన 'జయంతి పబ్లికేషన్స్' అధినేత యస్వీకృష్ణగారు అభినందనీయు"లని అన్నారు.

శ్రీమతి చిట్టే సిద్ధ లలిత మాట్లాడుతూ... నవలలోని ఇతివృత్తం, రాయలసీమ మాండలిక సౌందర్యం గురించి వివరిస్తూ రచయిత కథనాన్ని మలిచిన తీరును విశ్లేషించి రచయితను అభినందించారు.

శ్రీమతి ఎన్. లహరి నవలలోని పాత్రల చిత్రణ, సామాజిక నేపథ్యం, భాషా శైలిపై తన సమగ్ర సమీక్షను అందించారు.

శ్రీ చొక్కాపు వెంకటరమణ మాట్లాడుతూ... తెలుగు సాహిత్య వికాసానికి ఇటువంటి సాహిత్య ఉత్సవాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.

2వ రోజు ... మంగళవారం 27న కేంద్ర సాహిత్య అకాడమీ- బాలసాహిత్య పురస్కార గ్రహీత, 'మాస్టర్ స్టోరీ టెల్లర్' శ్రీ చొక్కాపు వెంకటరమణ రచించిన 5 పుస్తకాల సమూహమైన '500 అరనిమిషం కథ లు' లోకార్పిత మహోత్సవం ఈ సందర్భంగా వైభవంగా నిర్వహిం చబడింది.

ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ దానరి వెంకటరమణ పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం రచయిత్రి శ్రీమతి అరుణా రవికుమార్ తమ ప్రసంగంలో- "సామాన్యుల కష్టార్జితాన్ని, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కార్పొరేట్ శక్తులు ఏ విధంగా దోపిడీ చేస్తున్నాయో ఈ గ్రంథంలో సమగ్రంగా విశ్లేషించాను. సామా న్యుల ఆశలను దోపిడీ చేస్తున్న బహుళ జాతీయ సంస్థల మోసాల నుంచి సగటు ప్రజలను జాగృతం చేయాలనే ఉద్దేశ్యంతో ఆయా సంస్థల మోసాలను పరిశీలించి, కూలంకషంగా పరిశోధించి నేను రచించిన ఈ పుస్తకం ప్రజలకు ఒక మార్గదర్శిగా నిలుస్తుందని ఆశిస్తున్నాను" అని తెలిపారు.

ప్రత్యేక అతిథి శ్రీ కె. రాజేందర్ రాజు మాట్లాడుతూ.. "ఒక పోలీసు అధికారిగా, ముఖ్యంగా ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న కల్తీ నివారణ శాఖలో పనిచేస్తున్న వ్యక్తిగా నేను రోజూ చూస్తున్న కఠోర వాస్తవాలు మీతో పంచుకోవడానికి ఇక్కడకు వచ్చాను. మన దేశంలో, ముఖ్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లాంటి ప్రాంతాల్లో ఈ ఆర్థిక నేరాలు ఎలా వేళ్లూనుకున్నాయో 'ఆశల దోపిడి' పుస్తకం చాలా స్పష్టంగా కళ్లకు కట్టింది. మనం ఆహార భద్రత మరియు డ్రగ్స్ చట్టాల గురించి మాట్లాడుకుంటాం. కానీ, ఈ మల్టి లెవెల్ మార్కెటింగ్ (MLM) సంస్థలు ఏం చేస్తున్నాయి? అసలు శరీరానికి ఏమాత్రం అవసరం లేని, మార్కెట్లో సాధారణ ధర ఉండే వస్తువులను, పోషక విటమిన్లని, మందులని చెప్పి పదింతలు ఎక్కువ ధరకు అంటగడుతున్నారు. ఆహార పోషకాల ముసుగులో నిబంధనలకు విరుద్ధంగా మందులను, ఆస్టియో ఆర్థరైటిస్ చికిత్సలో వాడే గ్లూకోసోమైన్ లాంటి పదార్థాలను ఈ సంస్థలు విక్రయిస్తున్నాయి. నేరాల రూపాలు మారుతున్న ప్రస్తుత కాలంలో ఎం.ఎల్.ఎం. మరియు సైబర్ నేరాల పట్ల చట్టపరమైన అవగాహనతో పాటు ముందస్తు జాగ్రత్తలు చాలా అవసరం" అని ఉద్ఘాటించారు.

శ్రీమతి రమాదేవి కులకర్ణి మాట్లాడుతూ.. చట్టపరమైన అంశాలను, ప్రజలను మోసగించే వివిధ వ్యూహాలను ఈ పుస్తకం చక్కగా తూర్పారబట్టిందని, న్యాయ కోణంలో ఇది ఎంతో విలువైన గ్రంథమని, ఇలాంటి మోసాలకు గురికావడానికి ప్రజలలో ఎక్కువ శాతం వారికి విచక్షణ, వివేచనలు లోపించడమేనని శాస్త్రీయ విధానం (సైంటిఫిక్ అప్రోచ్)లో 'ఆశల దోపిడి' పుస్తకాన్ని విశ్లేషిస్తూ వివరించారు.

ఆత్మీయ అతిథిగా విచ్చేసిన శ్రీమతి కె. వందన మాట్లాడుతూ..సామాన్యులు తమ ఆర్థిక లావాదేవీలు, పెట్టుబడులు, బ్యాంకింగ్ వ్యవహారాల విషయంలో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఎలా జాగ్రత్త పడాలో వివరిస్తూ... ఇలాంటి విషయాల్లో సగటు సామాజికులను మేల్కొలిపేలా ఈ 'ఆశల దోపిడి' పుస్త కాన్ని రచించిన అరుణా రవికుమార్ గారినీ, ఈ పుస్త కాన్ని అద్భుతంగా ప్రచురించిన 'జయంతి పబ్లికేషన్స్' అధినేత యస్వీకృష్ణగారికి అభినందించారు.


ఎన్.వి.కృష్ణ మాట్లాడుతూ.. "సమాజానికి మేలు చేసే ఇటువంటి పరిశోధనాత్మక గ్రంథాలను ప్రచురించడం, ఇలా ఆవిష్కరణల ద్వారా వాటిపై చర్చించడం ఎంతో అవసరమని తెలుపుతూ ఇటువంటి సాహిత్యోత్సవాలు జరవడం ద్వారా క్రమంగా కనుమరుగవుతున్న పుస్తకానికి మళ్లీ ప్రాచుర్యం కల్పించేందుకు మా జయంతి పబ్లికేషన్స్ కృషి చేయడం సంతోషదాయకంగా ఉంది" అని తెలుపుతూ... "నకిలీ ఆశల వలలో పడకుండా మల్టీ లెవెల్ మార్కెటింగ్ మోసాలపై అవగాహన ఏర్పరచుకోవడం, నకిలీ ఆశల వలలో పడకపోవడం అవసరం" అంటూ తెలిపారు.

4వ రోజు గురువారం 29న 'వాస్తవిక వాద' కవయిత్రి, 'స్త్రీచైతన్య' ప్రవంతి... శ్రీమతి స్వయంప్రభ, నవ, యువ రచయిత్రి, కవయిత్రి కుమారి ఎస్వీకె. సంహితానాయుడు సంయుక్త సంపాదకత్వంలో రూపొందిన 'మహిళా సాధికారత' పట్ల నినదించిన సామూహిక గళం... 'స్త్రీ అస్తిత్వ వాద కవిత్వం'పై వెలువడిన తొలి సంకలనం... 'అస్తిత్వమ్' (75మంది కవులు, కవయిత్రులతో పాల్గొన్న కవితా సంకలనం) మరియు ప్రముఖ రచయిత, ప్రచురణ కర్త శ్రీ యస్వీ కృష్ణ కలం నుండి 'మార్మికవాదం'లో రచింపబడిన తొలి తెలుగు దీర్ఘ కవితాకావ్యం 'ఉపాసన' కి ఆంగ్ల, తమిళ అనువాదాల ఆవిష్కరణ మహోత్సవం జరిగింది.

ముఖ్య అతిథి నేటినిజం పత్రిక సంపాదకులు శ్రీ బైస దేవదాసు పై మూడు పుస్తకాలను ఆవిష్కరించి మాట్లాడుతూ.. "మహిళా సాధికారత పట్ల నినదించిన తొలిగళంగా 'అస్తిత్వమ్' కవితా సంకలనం నిలుస్తుంది. సమాజంలో స్త్రీల చైతన్యాన్ని, వారి ఉనికిని ఎలుగెత్తి చాటే ఇటువంటి రచనలు నేటి సమాజానికి ఎంతో అవసరం" అని పేర్కొన్నారు.

26 ఏళ్లుగా జయంతి పబ్లికేషన్స్ విజయవంతం కావడానికి ఎస్వీ కృష్ణ, శ్రీమతి స్వయంప్రభ, కుమారి ఎస్వీకె. సంహితానాయుడుల కృషి అని బైస దేవదాసు తెలిపారు.

సభాధ్యక్షులు డా: తిరునగరి శరత్ చంద్ర మాట్లాడుతూ...అధ్యక్షోపన్యాసం చేస్తూ- "తెలుగు సాహిత్యంలో మార్మికవాదానికి ప్రత్యేక స్థానం ఉంది" అన్నారు. యస్వీకృష్ణ కలం నుండి వెలువడిన 'ఉపాసన' తొలితెలుగు మార్మికవాద దీర్ఘకవితా కావ్యం ఆంగ్ల, తమిళ భాషల్లోకి అనువాదం కావడం తెలుగు సాహిత్య ఘనతను ఇతర భాషలకూ విస్తరింపజేస్తుంది" అని అభినందించారు.



7వ రోజున (చివరి రోజు) "భారతమ్మ శతకం" పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య గౌరిశంకర్ గారు. వేదికపై చొక్కాపు వెంకటరమణ, స్వయంప్రభ, కూర చిదంబరం, కవి మరీదుశ్రీ, కళా వి.ఎస్.జనార్ధనమూర్తి, డా: కోటేశ్వరరావు, పురం శ్రీనివాస్, యస్వీకృష్ణ

ప్రవ ముఖ కవి, సినీ-టీవీ నేయ రచయిత ప్రత్యేక అతిథి మౌనశ్రీ మల్లిక్ మాట్లాడుతూ.. .'అస్తిత్వం' కవితా సంకల నానికి సంపాదకత్వం వహించి, పుస్తకాన్ని సమంవంతంగా తీర్చిదిద్దిన స్వయంప్రభ, సంహితా నాయుడులను అభినందిస్తూ... యస్వీకృష్ణ రచించిన **'ఉపాసన'** దీర్ఘ కవితాకావ్యంపై చాలా లోతుగా విశ్లే షించి, ఇందులోని సాహిత్య విలువలను సవివరంగా వివరించి, కవి భావనాపటిమను, ఈ కావ్యరచనలో యస్వీకృష్ణ చూపిన ప్రతిభను ప్రశంసిస్తూ సుదీర్ఘ ప్రసంగం చేశారు.

ఆడపిల్లల సాధికారత మరియు స్త్రీ చైతన్య ప్రవంతి గురించి **'అస్తిత్వమ్'** సంకలనంలో సమాజంలో స్త్రీ కోణాన్ని ఆవిష్కరించిన తీరు అద్భుతమని రచయిత్రి, కవయిత్రి శ్రీమతి చిట్టే సిద్ధ లలిత కొనియాడారు.

తెలుగు భాషా వికాసానికి, సాహిత్య పోషణకు జయంతి పబ్లికేషన్స్ చేస్తున్న సేవలను అతిథి శ్రీమతి పురిమళ్ల సునంద కొనియాడారు.

'అస్తిత్వమ్' కవితా సంకలనంలో 'స్త్రీ అస్తిత్వం- మహిళా సాధికారత'లపై కవులూ, కవయిత్రులూ నిన దించిన కవితారూప భావాలు సాహిత్య చరిత్రలో ప్రత్యేకమైన మైలురాళ్లుగా నిలిచిపోతాయని శ్రీమతి కొల్లి రమావతి అభిప్రాయపడ్డారు.

ప్రత్యేక అతిథిగా విచ్చేసిన జబర్దస్త్ ఫేమ్, ఎఫ్-3 మీడియా ఫ్యాక్టరీ అధినేత శ్రీ వెంకీ మంకీ సాహిత్య రంగానికి యూట్యూబ్, డిజిటల్ మీడియా ద్వారా దక్కుతున్న ప్రచారం గురించి మాట్లాడారు.

పుస్తకావిష్కరణ అనంతరం 'అస్తిత్వమ్' కవితా సంకలనంలో కవితలు రాసిన వివిధ ప్రాంతాల కవులు పాల్గొన్న కవిసమ్మేళనం ఆహ్లాదకరంగా సాగింది. కవులు తమ తమ కవితలను స్వీయగొంతుతో వినిపించి సభను మైమరపించారు.

5వ రోజు ... శుక్రవారం 30న నవ, యువ రచయిత్రి కుమారి ఎస్.వి.కె. సంహితానాయుడు (ఎం.ఎస్సీ.) రచించిన 'కథాసంహిత' (కథల సంపుటి) మరియు 'వాస్తవిక వాద' కవయిత్రి శ్రీమతి స్వయంప్రభ సృజించిన **'వెన్నెల కురవని రాత్రి'** (కవితాసంపుటి) గ్రంథాలను ప్రముఖ, ప్రఖ్యాత సాహితీవేత్తలు వేదికపై ఆవిష్కరించారు. సభా ప్రారంభానికి ముందు **'క్షీణిస్తున్న మానవ సంబంధాలు'** అనే అంశంపై కవిసమ్మేళనం నిర్వహించారు.

ముఖ్య అతిథిగా విచ్చేసిన డా: భూసురవల్లి వేంకటేశ్వర్లు **'కథాసంహిత'** పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ... సమాజంలోని వివిధ పార్శ్వాలను, ఆధునిక జీవన విధానంలో విచ్ఛిన్నమవుతున్న కుటుంబ వ్యవస్థ, క్షీణిస్తున్న మానవ సంబంధాలను యువ రచయిత్రి సంహితానాయుడు ఎంతో పరిణతితో కథలుగా మలచారని కొనియాడారు. నేటి తరం యువత సాహిత్యరంగంలోకి వచ్చి ఇటువంటి మంచి కథాసంపుటాలను అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.

ప్రసిద్ధ విమర్శకులు డా: బీరం సుందరరావు **'వెన్నెల కురవని రాత్రి'** కవితా సంపుటాన్ని ఆవిష్కరించి సమీక్షించారు. కవయిత్రి స్వయంప్రభ వాస్తవిక వాదాన్ని, స్త్రీ చైతన్యాన్ని తన కవితల్లో ఎంతో ఆర్ద్రంగా, నిష్పక్షపాతంగా ఆవిష్కరించారని తెలిపారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలను, మానవ సంబంధాల లోతులను స్పృశిస్తూ రాసిన ఈ కవితలు పాఠకుల హృదయాలలోకి సూటిగా దూసుకెళ్లి ఆలోచింపజేస్తాయని ప్రశంసిస్తూ... **'వెన్నెల కురవని రాత్రి'** సంపుటిని ఆమూలాగ్రం ఎంతో లోతుగా విశ్లేషించి వివరించి పుస్తకంపై 'సిద్ధాంత వ్యాస సమర్పణ' చేసినట్లుగా తన సమీక్షను అందించారు.

సభాధ్యక్షులు ఆచార్య డా: కోయి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. అతిచిన్న వయస్సులోనే ఎంతో అనుభవమున్న రచయిత్రిగా కథలు రాసి, సంపుటిగా వెలువరించిన కుమారి ఎస్వీకె. సంహితానాయుడుని ప్రశంసిస్తూ... "ఈ సంపుటిలోని కథలన్నీ ఏదో ఒక కథల పోటీలో బహుమతి సాధించినవే కావడం గొప్ప విశేషం" అంటూ రచయిత్రికి ఆశీస్సులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటులు శ్రీ మాణిక్, ప్రముఖ వ్యాపారవేత్త-సినీ నిర్మాత శ్రీ ఎం. సునీల్ కుమార్, కవి-రచయిత శ్రీ ఈతకోట సుబ్బారావు, 'విశాలాక్షి' మాసపత్రిక సంపాదకులు (నెల్లూరు), సీనియర్ జర్నలిస్ట్ శ్రీమతి జొన్నలగడ్డ శ్యామల, గజల్ కవయిత్రి శ్రీమతి స్వప్నకృష్ణ (కరీంనగర్) తదితరులు పాల్గొని రచయిత్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

'జయంతి పబ్లికేషన్స్' అధినేత, ప్రముఖ రచయిత, ప్రచురణకర్త శ్రీ యస్వీకృష్ణగారు అధ్యక్షోపన్యాసం చేస్తూ... 26 ఏళ్లుగా 'జయంతి పబ్లికేషన్స్' తెలుగుభాషా వికాసానికి, మంచి సాహిత్య ప్రచురణకు కట్టుబడి ఉందన్నారు. రచయిత్రులు సంహితానాయుడు, స్వయంప్రభల పుస్తకాలు పాఠకాదరణ పొందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

6వ రోజు శనివారం 31న ప్రముఖ ఛార్టర్డ్ అకౌంటెంట్, ఆర్.వి. ఫౌండేషన్ ఫౌండర్ మరియు చైర్మన్ శ్రీ బి. విజయకుమార్ రచించిన **'రామాయణ్... పార్ట్-3'** (విశ్లేషణాత్మక వ్యాస సంపుటి) గ్రంథ (విశ్లేషణాత్మక వ్యాస సంపుటి) అత్యంత నేత్రపర్వంగా నిర్వహించబడింది.

సభా ప్రారంభానికి ముందు **'నేటి కాలంలో శ్రీరాముడి ఆదర్శం'** అనే అంశంపై కవిసమ్మేళనం పండితులు, శ్రోతలను ఎంతగానో అలరించింది.

తెలంగాణ రాష్ట్ర బి.సి. స్టడీ సర్కిల్ డైరెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ మామిడి హరికృష్ణ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ.. "రామాయణం కేవలం ఒక ప్రాచీన కావ్యమే కాదు, అది నిత్య నూతనమైన జీవన వేదం. రచయిత బి. విజయకుమార్‌గారు రామాయణంలోని అంతరార్థాలను, సమకాలీన పరిస్థితుల్లో రేగిన వివాదాలను విశ్లేషణాత్మకంగా ఈ వ్యాస సంపుటిలో మలచిన తీరు అభినందనీయం. సమాజానికి నైతిక మూల్యాలను అందించడంలో ఇటువంటి రచనలు ఎంతగానో తోడ్పడతాయి" అని అన్నారు.

సభాధ్యక్షులు శ్రీ సబ్బని లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ... "భరతమాత గొప్పద నాన్ని, దేశభక్తిని, సాంస్కృతిక వైభవాన్ని నేటి తరానికి అందించేలా **'భారతమ్మ శతకం'** కృతిని మరీ దుర్శ్రీ గారు ఎంతో అద్భుత మైన పద్యరూపం లో రచించారు. ప్రతి పదంలోనూ దేశభక్తి స్ఫూర్తి తొణికిస లాడుతోంది" అని కొనియాడారు.

సభాధ్యక్షులు శ్రీ చొక్కాపు వెంకటరమణ మాట్లాడుతూ.. "జయంతి పబ్లికేషన్స్ గత 26ఏళ్లుగా తెలుగు సాహిత్యానికి అందిస్తున్న సేవలు ప్రశంసనీ యం. 'సాహితీ సప్తకమ్' ద్వారా 7 రోజుల పాటు సాహిత్యోత్స వాన్ని నిర్వహించి, చివరి రోజున **'భారతమ్మ శతకం'** వంటి ఉత్తమ పద్యసంపుటిని పాఠకులకు అందించడం అభినందనీయం" అని పేర్కొన్నారు.

విశిష్ట అతిథి త్యాగరాయ గానసభ అధ్యక్షులు శ్రీ కళా వి.ఎస్. జనార్ధన మూర్తి మాట్లా డుతూ... కళలు, సాహిత్య వికాసానికి



4వ రోజున "అస్తిత్వం" కవితా సంకలనం, "ఉపాసన" దీర్ఘకవిత (ఆంగ్ల, తమిళ అనువాదాలు) పుస్తకాలను ఆవిష్కరిస్తున్న "నేటినిజం" సంపాదకులు బైస దేవదాసు. వేదికపై శరత్ చంద్ర, యస్వీకృష్ణ, చొక్కాపు వెంకటరమణ, మౌనశ్రీ మల్లిక్, స్వయంప్రభ, ఎస్వీకె. సంహితానాయుడు, పురిమళ్ల సునంద, చిట్టే సిద్ధ లలిత

"సాహిత్య విమర్శ, విశ్లేషణ విభాగంలో ఈ పుస్తకం ఒక మైలురాయిగా నిలుస్తుంది. విజయ కుమార్ గారి అధ్యయన పఠనం, లోతైన విశ్లేషణాత్మక ధోరణి పుస్తకంలోని ప్రతి వ్యాసంలోనూ స్పష్టంగా కనిపిస్తుంది" అని ప్రశంసించారు.

గౌరవ అతిదిగా విచ్చేసిన శ్రీ సాత్యకి మాట్లా డుతూ.. "రచయిత వృత్తిరీత్యా ఛార్టర్డ్ అకౌంటెంట్ అయి నప్పటికీ- ప్రవృత్తిగా సాహిత్యంపై పెంచు కున్న మక్కువ, రామాయణ మహానదిని విశ్లేషించిన విధానం అద్భుతం. భీర్యం ఎంతో ఆకట్టుకున్నాయని ప్రశంసించారు.

సీనియర్ రచయిత, సాహితీ విమర్శకులు కూర చిదంబరం గ్రంథ విశేషాలను వివరిస్తూ... 'భారతమ్మ శతకం'లోని పద్యాల శైలి, ఛందస్సు మరియు విమర్శ నాత్మక దృక్పథంపై సభకు సమగ్ర విశ్లేషణను అందించారు.



సాహితీ సప్తకం"లో 6వ రోజున "రామాయణం" పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డా: మామిడి హరికృష్ణ, వేదికపై స్వయంప్రభ, ఎస్వీకె. సంహితానాయుడు, డా: కాకునూరి సూర్యనారాయణ మూర్తి, సబ్బని లక్ష్మీనారాయణ, రచయిత విజయ్ కుమార్, సాత్యకి, చొక్కాపు వెంకటరమణ, గౌస్ మొహియుద్దీన్ మషాక మణియార్, యస్వీకృష్ణ .

శేషేంద్రశర్మ గారి సా హిత్య స్ఫూర్తిని ఈతరం ముందు కు తీసుకెళ్లడం సంతోషకరం" అన్నారు.

ప్రత్యేక అతిథిగా విచ్చేసిన ఆచార్య కాకునూరి సూర్య నారాయణమూర్తి మాట్లాడుతూ.. "రామాయణంలోని పాత్రల స్వభావాలను, నేటి సమాజానికి అవి అందించే సందేశాన్ని రచయిత చాలా క్షుణ్ణంగా, స్పష్ట మైన భాషలో విశ్లేషించారు" అని అభిప్రాయపడుతూ... విజయ కుమార్ రచించిన పుస్తకంలోని ఎన్నో విషయాలను చర్చించి, రామాయణంలోని ఎన్నెన్నో నిగూఢ విషయాలను తనదైన ఆధ్యాత్మిక పరిణతితో విశ్లేషించి వివరిస్తూ... అనర్ఘళమైన తన వ్యాఖ్యానంతో సుదీర్ఘ ప్రసంగం చేశారు.

శ్రీ గౌస్ మొహియుద్దీన్ మషాక్ మణియార్ మాట్లా డుతూ. "శ్రీరాముని ఆదర్శాలు, ధర్మ బద్ధమైన జీవనం విశ్వజనీ నమైనవి. మతాలకు అతీతంగా రామాయణం మానవాళికి జీవన మార్గదర్శిగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు. "ఈ గ్రంథం యువతరానికి రామాయణంలోని సారాంశాన్ని సులభంగా అర్థం చేసుకునేలా దోహదపడుతుంది" అంటూ విజయకుమార్ గారి విశ్లేషణాత్మక శైలిని కొనియాడుతూ శుభాకాంక్షలు అందజేశారు.

చివరి రోజు . ఆదివారం నవంబర్ 1న ముఖ్య అతిథి 'తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి. గౌరీశంకర్ ఆత్మీయ అతిథి శ్రీ పురం శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థు ల్లో మరియు యువతలో దేశభక్తి పెంపొందించడానికి ఇటువంటి శతక గ్రంథాలు ఎంతో ఉపయోగపడతాయని వ్యాఖ్యానించారు.

"మహనీయుల జీవితాలే మావంటి యువతకి స్ఫూర్తి" అని పేర్కొంటూ... తెలుగు భాషలో తప్ప ప్రపంచ భాషల్లో ఏ భాషలోనూ లేని 'పద్య ప్రక్రియ' ను కొనసాగిస్తూ రాయబడిన ఈ 'భారతమ్మ శతకం'లో మన భారదేశ చరిత్రను, సంస్కృతిని నిర్మించిన ఎందరో మహోను భావుల గురించి ఒక్కొక్క పద్యం లో వివరిస్తూ 108 పద్యాలతో శతక రచన చేసిన శ్రీ మరీదుగారు మన భారతీయ వైభవాన్ని ఇప్పటి తరాలకు తెలిసేట్లు ఈ పుస్తకాన్ని రచించారు. ఈరోజుల్లో ఇలాంటి పుస్తకాలు పాఠశాల దశలోనే విద్యార్థులకు అందు బాటులో ఉండేందుకు పాఠ్యగ్రంథంగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతగానో ఉందని నేను భావిస్తున్నాను" అంటూ... యువ రచయిత్రి, కవయిత్రి- ఆత్మీయ అతిథి కుమారి ఎస్వీకె. సంహితానా యుడు రచయితకి తన అభినం దనలు తెలిపారు.

ఈ గ్రంథావిష్కరణ సభా ప్రారంభానికి ముందు **'భారతీయ వైతాళికులు'** అనే అంశంపై కవిసమ్మేళనం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది.

ఈ 7 రోజుల కార్యక్రమాలు ఘన విజయంగా జరగానికి 'జయంతి పబ్లికేషన్స్' అధినేత, ప్రోగ్రామ్ ఎగ్జిక్యూషన్ బాధ్యులు శ్రీ యస్వీకృష్ణ, చీఫ్ కో-ఆర్డినేటర్ శ్రీమతి స్వయంప్రభ, టెక్నికల్ సపోర్ట్ అందించిన నవ, యువ రచయిత్రి/కవయిత్రి కుమారి ఎస్వీకె. సంహితా నాయుడు, ఆహ్వాన కమిటీ సభ్యులు ఎంతగానో కృషి చేశారు.

ఈ సభలో ఆహ్వాన కమిటీ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో సాహిత్యాభిమానులు, కవులు పాల్గొన్నారు.

(నేటినిజం ప్రతినిధి)

దేవులపల్లి వెంకటకృష్ణశాస్త్రి గీతాలు మధురం



రామజోగయ్య శాస్త్రికి పురస్కారం ప్రదానం చేస్తున్న వంశీ రామరాజు, వెంకటనారాయణ, సుద్దాల అశోక్‌తేజ.

హైదరాబాద్, నవంబర్ 4(నేటినిజం ప్రతినిధి): వంశీ ఆర్ట్ థియేటర్స్, లేఖిని రచయిత్రుల వేదిక సంయుక్తాధ్వర్యంలో పద్మభూషణ్ పురస్కార గ్రహీత దేవులపల్లి వెంకట కృష్ణశాస్త్రి జయంతి కార్యక్రమాన్ని సోమవారం రాత్రి త్యాగరాయ గానసభలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ గేయ రచయిత రామ జోగయ్య శాస్త్రికి వంశీ-దేవులపల్లి జాతీయ పురస్కారాన్ని సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ ప్రదానం చేసి సన్మానించారు. ప్రముఖ సాహితీ వేత్త, ఓలేటి పార్వతీశం అధ్యక్షత వహించిన కార్యక్రమంలో తెలుగు అకాడమీ చైర్మన్ కూర పాటి వెంకట నారాయణ, ప్రముఖులు రేలంగి నరసింహా రావు, వంశీ రామరాజు, శైలజ తది తరులు పాల్గొన్నారు.

డా॥చమన్‌సింగ్, సంగిశెట్టి శ్రీనివాస్‌లకు 'గోదావరి గొంతుక' మల్లావఝుల సదాశివుడు స్మారక పురస్కారాల ప్రదానం





మంగళవారం ఖైరతాబాద్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లోని ఆడిటోరియంలో తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 'గోదావరి గొంతుక' మల్లావఝుల సదాశివుడు స్మారక పురస్కారాలను డా॥చమన్‌సింగ్, సంగిశెట్టి శ్రీనివాస్‌లకు అందజేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.చిత్రంలో ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, గోరటి వెంకన్న, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్, బీఆర్ఎస్ నాయకులు దేవిప్రసాద్, సినీయర్ జర్నలిస్ట్ విరాహత్ అలీ, కవి వనపట్ల సుబ్బయ్య, ప్రముఖ గాయకుడు కవ్వంపల్లి స్వామి. సదాశివుడు కుమారులు విజయానంద్, వంశీ, కుమార్తె కృష్ణవేణి, రచయితలు, కవులు, కళాకారులు తదితరులు.

మేధ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి.

కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1925వ రోజు 'ఇంటర్నెట్' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'ఇంటర్నెట్' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

-సంపాదకులు



మేధ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
అడ్మిన్ & నిర్వహణ
డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్‌రావు,
9441046839

అరచేతిలో అనంతాకాశం

అరచేతిలో ఒదిగిన ఆకాశం
అందులో ఎన్ని లోకాలో
వేల మైళ్ల దూరాన్ని
వేళ్ల కొనలతో తాకే
వింత మాయాజాలం
కనిపించని తీగలపై
కాలం పరుగులు తీస్తుంటే
కనురెప్ప పాటులోనే
ఖండాంతరాల కబుర్లు.
పుస్తకాల వనమై
విశ్వవిజ్ఞానపు నిధియై
గడప దాటకుండానే
ప్రపంచాన్ని చూపే కిటికీయై
అదే తెరపై మరో చిత్రం
అనుబంధాల మధ్య అగాధాలు
పలకరింపుల స్థానంలో
పలుచని అక్షరాల పరామర్శలు
ముఖాలన్నీ తెరల వెనకే
మనసులన్నీ ముసుగుల వెనకే.
నిజమేదో నీడేదో తెలియని
నీలి వెలుగుల నిశీధిలో
క్షణిక కీర్తి కోసం
కృత్రిమ నవ్వుల ప్రదర్శన
మాటల ప్రవాహం
విషపు చుక్కలు కలుపుతుంది
వివేకం నిద్రపోతే
పదంతుల వలలో బంధిస్తుంది.
సమయాన్ని ఆదా చేస్తానంటూ
సమయాన్నే మింగే మహామాయ
చేతిలో ప్రపంచం ఉన్నా
చేతులు కదపలేని దుస్థితి
అక్షరాల అరణ్యంలో
అర్థాల వేట
వెలుగును అందించే దీపం
వెన్నెలను మింగే అగ్ని కాకూడదు.
అవసరానికి వాడిన సాధనం
అనవసరానికి సంకెళ్లు కాకూడదు
అంతర్జాలమా!
నీవు అనంతమైన ఆకాశమే
కానీ ఎగరడం తెలిసిన రెక్కలకే
నీ విశాలతలో స్వేచ్ఛ.
నీ అలలపై ప్రయాణిస్తూ
మనిషి తన దారిని మరువకూడదు
కాలపు కవాటాలను తెరచే తాళమై
కనిపించని విశ్వానికి చిరునామాగా
నీ వెలుగులో ప్రపంచాన్ని చూస్తూ
ఒక చిన్న తెరను తడిమి
తన కలలకు రెక్కలు కడుతున్నాడు
తనలోని వెలుగును కోల్పోకూడదు
చిన్న పొరపాటు
పెద్ద జీవితం పట్టీ
చిన్న అజాగ్రత్త
ఆశల గూడు ఖాళీ
అయినా నిన్ను నిందించలేను
నీవు కత్తివి
కోయడమూ నీదే
కాపాడడమూ నీదే.
తెరపై వేల లోకాలు తెరుచుకున్నా
మనసులోని లోకం
మూసుకుపోకూడదు
ప్రపంచాన్ని అనుసంధానించే నీ చేతుల్లో
మనిషి తనను తాను కోల్పోక
అదృశ్యమైన నీ సామ్రాజ్యంలో
దృశ్యమైన మానవత్వంతో మెరవాలి.

- శ్రీలతరమేశ్ గోస్కుల

సాంకేతిక సమ్మోహనం

నేటి ఆబాలగోపాలాన్ని
మైమరపిస్తున్న అంతర్జాలం
ఆధునిక విజ్ఞానం రూపొందించిన
సాంకేతిక సమ్మోహనాస్త్రం!.
సకల సద్గుణాలు
అరిషడ్వర్గాల సమ్మేళనమైన
మానవుడు సృష్టించిన అంతర్జాలం
దూరాన ఉన్న కుటుంబ సభ్యులతో
బంధుమిత్రులతో మాట కలిపే సాధనం.
మనసులోని మాటను తెలిపి
బంధాలను, అనుబంధాలను
నిలిపే కల్పతరువు
సకల రంగాల సమాచారం
అంతర్జాలంలో క్షణాల్లో
అరచేతిలో ప్రత్యక్షం!.
విద్యార్థులకు కావలసిన పరిజ్ఞానాన్ని
అతి శీఘ్రంగా అందించే కామధేనువు,
కాలు కదపకుండగనే కావ్య పఠనం
సాహిత్య సృజన సుసాధ్యం.
ఇంటి నుంచే ప్రపంచ వ్యాప్త
జ్ఞానధనుల, విజ్ఞాన ఖనుల సాంగత్యం
నాడు కరోనా రక్కసి
గృహనిర్బంధం చేసిన యావత్ప్రపంచాన్నీ
ఆప్యాయంగా
అక్కున జేర్చుకున్న అంతర్జాలం
జవజీవాల మాతృభాషలను
విశ్వవీణపై మారుమోగిస్తున్న
చరవాణులకు వందనాలు.
అహర్నిశలూ అనుక్షణమూ
అంతర్జాల వీక్షణంలో
మస్తిష్కం అయోమయంలో
అంతర్జాల మాయాజాలంలో
చిక్కుకుని చిక్కులపాలౌతున్న
యువత మేధస్సు.
అసంబద్ధ సమాచారం
అవాంఛనీయ చిత్రాల
మాయాబజారులో
విలువల విక్రయం
మానవుడు సాధించుకున్న
సంస్కృతీ నాగరికతలను
అధఃపాతాళానికి పంపుతోంది
అంతర్జాలం.
విజ్ఞానం అందించిన
అద్భుత అంతర్జాలాన్ని
విచక్షణతో వినియోగించుకుందాం
సంక్లిష్ట సాంకేతిక సమాజాన్ని
సరాగాల పల్లకీలో
హుందాగా నడిపించుకుందాం .

-ముద్దు వెంకటలక్ష్మి

తరంగిణి

తరంగాల సాయంతో సంధించే
సమాచార మార్పిడి
అరచేతిలో వైకుంఠంలా ఇమిడిపోయే
సెల్లు పనిచేయాలన్నా
కంప్యూటర్ కార్యక్రమంలో
మునిగి తేలాలన్నా
ఇంటర్నెట్ ఇగురంగా పనిచేయాల్సిందే.
వాడవాడలా పిల్లతోవలన్నీ కలిసి
ఊరూరికి వెళ్ళే దారుల్లో కలిసిపోయి
ప్రాంతీయ రహదారులుగా వెలిసి
జాతీయ రహదారులుగా మారిపోయి
దేశాల మధ్య
వాయు జల వివిధ రకాల మార్గాలుగా
అనుసంధానించిన విధంగా
ప్రపంచ వ్యాప్తంగా
కంప్యూటర్ల మధ్య విస్తరించి
సమాచార మార్పిడికి సౌలభ్యం
చేకూర్చేదే ఇంటర్నెట్.
శాటిలైట్లు సర్వర్లు
కంప్యూటర్లు ముఖ్యభాగాలైనప్పటికి
ఎన్నో పరికరాలు బదుల్లో
ఆసుపత్రుల్లో
యుద్ధభూమిలో పనిచేస్తూ
కోట్ల మంది అవసరాలు తీర్చుతూ
కొండంత ప్రపంచాన్ని
పటాటోపంగా నడిపిస్తున్నది.
నాణానికి రెండువైపుల్లా
మంచి చెడుల సమ్మేళనం
విచక్షణలతో మనమంతా
మంచికి అభివృద్ధికి
బాటలు వేసుకుంటూ
పదికాలాలు పచ్చగా ఫరిఢవిల్లుదాం.

-నగునూరి రాజన్న

అంతర్ వలె!

అరచేతిలో అంతర్జాలం
కన్నార్పకుండా చూపించేస్తూ
సమయం మించిన దినచర్యలతో
పిల్లా పెద్దా తేడా లేకుండా
ఆకలి దప్పులను మింగేస్తూ
ఆరోగ్యాన్ని ఆమడ దూరం నెట్టేస్తూ
మురిపిస్తుంది
లోకాన్నే మరిపిస్తుంది
స్వేచ్ఛను మింగేస్తూ
నెట్ వలలో బందీలై పోతూ
నాగరికతకు దూరంగా
మూర్ఖత్వాలను పెంచేస్తూ
దుర్వినియోగంతో
ధర్మాధర్మాల విచక్షణనువెలి వేస్తుంది
విలువలను మింగేస్తుంది
విలవిల లాడుతుంది
మోజుల భ్రమల్లో.
నెట్ ఉంటే ఇల్లంతా సంబరం
లేదన్న మాట అబ్బురం
మేధా విజ్ఞానంతో
మనిషే సృష్టించిన అద్భుత మిది
అంతరిక్షం పైపు అడుగులు వేయించి
అందరినీ ఒకే తాటిపై నడిపించిన
వైజ్ఞానిక గమనమిది.
లోకం అయిపోతుంది దాసోహం
దుర్వినియోగంతో స్వార్థానికి వాడుకుంటూ
ఆనందాలను సెల్ లో కొనుక్కుంటూ
కనుమరుగవుతున్న బంధాలతో
చాటింగులు షాటింగుల రీల్స్ తీస్తూ
గతి తప్పిన జీవన శైలిలో
మునకలు వేస్తున్న మాయల మరాఠీ
మంత్రాల తంత్రాల నెట్
వధ్యశిలపై తనకు తాను
బలి అయిపోతున్నాడు.

-పి.పద్మావతి

జాగ్రత్త సుమా!

అరచేతిలో ప్రపంచ దర్శనం
అర నిమిషంలోనే
సమస్త సమాచారం
అందరి జీవితాల్లో వెలుగులు
అతిగా వాడితే
ఆమడదూరం ఉండటమే మేలు!
పసిపిల్లాడి నుంచి
పండు ముసలి వరకు
పస్తులున్నా పర్వాలేదు
ఫోన్ ఉండాల్సిందే!
పనికి పోయినవాడు పనిని మరచి
ఫోన్‌లోనే మునిగిపోతున్నాడు నెట్ మాయలో!
కూర్చున్న చోటనే లోకాన్ని చూపిస్తుంది
కదలిక లేకుండానే కాలాన్ని గడిపిస్తుంది
కనురెప్ప వాల్చకుండా చూడమంటుంది నెట్
కనికరం లేకుండా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది!.
విద్యా విజ్ఞానాల వాకిళ్లు తెరిచే నెట్
విజయాల బాటలో నడిపించే మంచి నేస్తం!
వినియోగంలో వివేకం పెరగాలి
విజయానికి అదే తొలి మెట్టు కావాలి!.
నవసమాజ అభివృద్ధికి నాంది పలుకుతూ
నవీన పుంతల్లో ముందుకు నడిపిస్తూ
నాగరికతకు కొత్త రూపునిస్తూ
నూతన ప్రపంచాన్ని
మన ముందుంచుతుంది!.
మిత్రమా! కాస్త జాగ్రత్త,
అతిగా వాడితే అదే పెను ప్రమాదం!
అబద్ధపు వార్తలకు ఆమడదూరం
మోసాల వలలో చిక్కకుండా
సాగిపో ముందుకు!.
నెట్ మన చేతిలో జ్ఞానదీపం కావాలి
మన జీవితానికి వెలుగుబాట కావాలి!
వినియోగమే విజ్ఞానానికి కొలమానం
విచక్షణే విజయానికి నిజమైన ప్రమాణం!.
ఇంటర్నెట్ ఒక అద్భుత శక్తి
సద్వినియోగమే దాని అసలైన యుక్తి!
జ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి
సాంకేతికతలో లోకానికి దీటుగా నిలవాలి!.
తస్మాత్ జాగ్రత్త!
నెట్‌తో నెట్టకు జీవితాన్ని
నెట్‌ను వాడుకో
ఎదుగుదల కోసనీ.

-దా.అరుణ పరంధాములు

బంధాలు కట్

వింతలు విశేషాలతో నిండిన
అంతరంగం
ప్రపంచాన్నంతా
తన గర్భంలో దాచుకుంది
కొనుక్కుంటే వస్తుంది వెంట
మనువాడిన బంధం లెక్క
బటన్ నొక్కితే ప్రసవిస్తుంది
ప్రచారాలను.
ఇష్టపడితే వదలదింక
ప్రతీ విషయాన్నీ కళ్ల ముందు
పెడుతుంది కష్టపడకుండా
రంగుల ప్రపంచాన్ని
చూపిస్తుంది కంటినిండా
తనకు దాసోహం
చేసుకుంటుంది తెలువకుండా.
టచ్ ఫోనుకు దగ్గరయ్యారు
చిన్నా పెద్దా
బంధాల అనుబంధాలను
దూరం చేస్తుంది మెల్లగా
ఇంటర్ నెట్ లో ఉద్యోగాలు
వీడియో కాల్ లో ప్రేమలు పెళ్లిళ్లు
ఆన్లైన్లో చావులకు సంతాపాలు
దినాలు పిండాలు.
ఇంటర్ నెట్ కట్ చేస్తుంటే
బంధాలను
వీడియో కాల్ చూసి
జరుపుకుంటారు పండుగలు
మానవ సృష్టి మనుషులనే
మేస్తుంది మెల్లగా.
తీరొక్క కథనాల పేజీలను
కదుపులో దాచుకొని
క్షణాలలో చూపిస్తుంది
కంటికి ఇంపుగా
మనసుకు దగ్గరగా
సక్రమంగా వినియోగించుకుంటే
భవిష్యత్తు చూపిస్తుంది
పనికి రాని పేజీలను
తిప్పి చదివితే చెడగొడుతుంది.

-పొన్నాల ధనమ్మ


నారంశెట్టి బాలసాహిత్య పీఠం బాలల కథల పోటీ

హైదరాబాద్, నవంబర్ 4(నేటినిజం ప్రతినిధి): నవంబర్ 14 బాలల దినోత్సవం సందర్భంగా పార్వతీపురంకి చెందిన నారంశెట్టి బాలసాహిత్య పీఠం బాలల కథల పోటీ - 2026 నిర్వహిస్తోంది. ప్రథమ బహుమతి రూ.3,000, ద్వితీయ బహుమతి రూ.2,000, తృతీయ బహుమతి రూ.1000/- మరియు మరో పది కథలకు ప్రోత్సాహక బహుమతిగా రూ. 500/- చొప్పున ఉంటాయి. కథావస్తువు ఆధునిక తరం పిల్లలను ఆకట్టుకునే విధంగా ఉండాలి. ఇతివృత్తం ఏదైనా ఫరవాలేదు. ఒక రచయిత ఎన్ని కథలైనా పంపవచ్చు. కథ 500 పదాలకు మించకూడదు. కథలన్నీ సంకలనంగా ప్రచురిస్తారు. యూనికోడ్‌లో టైప్ చేసిన కథను umamaheshnaram@gmail.com కు మెయిల్ చేయాలి . ఇతర మాధ్యమాల్లో ఇప్పటికే ప్రచురితమైన లేదా పరిశీలనలో ఉన్న కథలను పంపకూడదు. కథతో హామీ పత్రం జతచేయాలి. కథలు పంపడానికి చివరి తేదీ **నవంబరు 20, 2026.** వివరాలకు 9490 799203 నంబరులో వాట్సప్ లో సంప్రదించవచ్చు.

- నారంశెట్టి ఉమామహేశ్వరరావు,







సిద్దిపేట

సిద్దిపేట
ఓ వెలుగుతున్న దీపం -
ఏ పాడు గాలికి ఆరిపోకుండా
చేతులడ్డంపెడదాం.
సిద్దిపేట
ఓ సిరుల లక్ష్మి
దాన్నిఎప్పుడూ
ముత్తెదువగానే ఉంచుదాం.
సిద్దిపేట
ఓ ప్రశ్నించే గొంతుక -
దాన్ని ఎప్పుడూ
తెరిచే ఉంచుదాం

- ఎన్.నరేశ్ చారి

గుండె బరువులు!

పునాస దుక్కుల ఆనందం ఆవిరై
అన్నదాత ఆగమై
గలగల పారే కాల్వనీరు
మూగబోయిన దేశంలో
కర్షకుడి కన్నీరే మొగులవుతున్నది
ఆకాశాన కన్నుగొడుతూ
కదులుతున్న మబ్బులమాదిరే
కిసాన్ కంటి కలలు
వింతవింత ఆలోచనలు
కడలితో గాలి జగడం
ఎల్ నినో ఇలకు దిగడం
ఎంత కష్టమో ఎంతనష్టమో
ఊహించని పరిణామం ఇది.
చల్లదనం హుష్ కాకి
ఎండల ఎరువాక మొదలయింది
ఉడుకుపొద్దుల జైత్రయాత్రలో
ఉష్ణ గాలుల దండయాత్రలో
వానలు మొరాయించిన క్షామం ఇది.
కాలమంతా
పొడిగాలితో కాటువేస్తే
పొలమంతా పొలమారి
అగులు బుగులు తుంగ మొలిచింది
అకాల వానకు
పత్తి పంట పక్కకి వాలితే
రైతు గుండెను బాధే ఏలితే
పత్తి కాయలు కావు ప్రభూ
అన్నంబెట్టే నాగలినరుడి
గుండె కాలేయలే పగులుతున్నవి.
ఎల్ నినో పాడుకాలం
పరికి ఉరి బిగించి
బాజాప్తా బహిరంగ యుద్ధం
చేస్తున్నది
అడ్డెవరు ఆపేదెవడు? సామి
వాగువంకలు చెరువులు
గుండెలు ఎండి
పురుగు పుట్ల కడుపుకాలే
ఎగిరే పిట్ట నేలరాలే
నీటి మట్టం నేలకు చుట్టమై
బోరు బావులు
భోరుభోరుమంటున్నవి
తడి సవ్వడులు లేక
జలవిద్యుత్తు కళతప్పి
బొగ్గు విద్యుత్తు తడసిమోపడై
కరెంటు కోతలు అగ్గిబుక్కతున్నవి
పచ్చంగా నవ్వే మాగాణి భూమి
నెర్రలిడిసి ఎడారిగా
వేయితలల వెర్రి వేషమేస్తున్నది
నేనున్నానంటూ
నీటి పొదుపు సూత్రం వల్లిస్తూ
ఆరుతడి పంటలేయమంటూ
రాజ్యం సలహా పాట
రైతును వినమంటున్నది పాపం!.
దిగుబడులను టన్నుల కొద్ది
కొలసిన ప్రాణం
కరువు తాండవిస్తుంటే
చేతులెత్తేసి పంటల్ని కాదు
దిగులు గుండె బరువుల్ని
తూకం వేస్తదేమో బహుశా.

-రమేశ్ నల్లగొండ
8309452179



నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

-సంపాదకులు

బహుపరాక్ !!

బాల్యంలో పలక పై బలపంతో
శ్రీకారం చుట్టిన వాళ్లే
ఇపుడు తమ భవిష్యత్తు భంగం అవుతున్నపుడు
పార్లమెంటు సాక్షిగా ఉద్యమాలకు పిడికిలెత్తి
శ్రీకారం చుట్టారు దార్శనికంగా !!.
రాబోయే యువతకు జంతర్ మంతర్ ముందు
దోషాలు లేని దిక్సూచిగా దిక్కులను
ఒకటి చేసి ప్రతిష్టించారు !.
పాలకులు తోవ తప్పినపుడు
లైట్ హౌస్ గా యువత ప్రాణాలను త్యాగం చేసి
కాంతిపథంగా కొత్త చరిత్ర కాలం పై రాసారు
వర్తమానం భవిష్యత్తులకు స్ఫూరిగా !
రాబోయే మన పిల్లలందరు ఈ ఉద్యమ శ్రీకారాన్ని
అసలైన పాఠంగా గుర్తుంచుకొని అనుసరిస్తారు.
ఇక ముందు సింహాసనాల పై కూర్చునే
అధినాయకులూ
ఈ పాఠం మననం చేసుకోవాల్సిందే
బహుపరాక్ !!

-కందాళై రాఘవాచార్య
8790593638

పి.ఎఫ్. పెన్షన్

ఎన్నో నిశి రాత్రులను
శ్రమ సౌందర్యం తో ఛేదించి
ఎన్నెన్నో కాలుష్య ఆవిర్లను బిగబట్టుకొని
వర్ణ వైశ్యామ్యాల ఒత్తిడిలను తట్టుకుని
దేశ ప్రగతికి చేయుతనందిస్తు
గరల ఖంటుడు వలె
విషపు గాలులను
ముక్కు పుటలలో బంధించిన
ఆమ్లఘాడతలు
రసాయన బిందువులు
నిశ్శబ్దంగ దేహాన్ని కొరికేస్తుంటే
మౌనంగ ఎన్నో సార్లు గాయపడినవి
భరించలేని ప్రాణాలు
ఏనాడు సుఖాన్ని కోరుకోలే
శ్రమజైకము లో
ఆలు బిడ్డల భవిష్యత్తును విస్మరించక
శ్రమ శ్రమ శ్రమంటు పరిశ్రమ చేస్తూ
యవ్వనం దాటి వృద్ధాప్యాన్ని ముద్దాడినం .
ప్రతి వేతనం మీద శ్రమ బిందువుల అంకెలే
కూడికలు వేసుకొంటవి
నెల నెల సంసార పడవ తీరం చేరడానికి
భవిష్య నిధి కార్మికుల స్వప్నం కానే కాదు
ఓటు కొరకు పాలకులు
పాలకులు విసిరే పెన్షనేకాదు
కార్మికుల హక్కు ఆ హక్కుకై
తిరిగి తిరిగి కాళ్లు అరిగిన
ఊడిన ఉంగటాలు
తెగిన చెప్పులు లెక్కనే పెట్టలే
ఏండ్లకేన్లు భూప్రదక్షిణ చేసినట్టే
భవిష్యత్ కార్యాలయాల చుట్టూ
ప్రదక్షణలే అభ్యర్థనలు, విన్నపాలు,
గెరావ్,లు నిరసన లెన్ని చేసిన
ఆ కుర్చీమీద కూసున్నోడు
కార్మికుడైతే కదా..
విరమణ కార్మికులకు ఇచ్చే
కనీస వెయ్యి రూపాయల
పి.ఎఫ్. పెన్షన్
కొనుగోలు సరుకులకు
పెరుగుతున్న ధరలకు
వేసిన టాక్స్ లకే సరిపోవట్లే
కార్మికులు యంత్రాలు కాదని
మనుషులేనని గుర్తించండి
మేముకూడ బతకాలి కదా సచ్చేదాక

-యరకల యాదయ్య.
9866468979

జర్నలిస్ట్ కుటుంబాన్ని పరామర్శించిన టీజేఏ నాయకులు

ములుగు, నవంబర్ 4: (నేటినిజం ప్రతినిధి): సీనియర్ జర్నలిస్ట్ రాయల గోపి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబాన్ని పరామర్శించిన తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ (టీజెఏ) ములుగు జిల్లా కమిటీ.



ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లోని జవహర్ నగర్ గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ రాయల్ గోపిప్రథమ వర్ధంతి సందర్భంగా ఈరోజు (బుధవారం) వారి నివాసానికి వెళ్లి కుటుంబాన్నిపరామర్శించి, మనోధైర్యాన్ని అందించిన తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) ములుగు జిల్లా కమిటీ. జిల్లా కమిటీ తరపున ఆయన కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందజేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో టీజేఏ ములుగు జిల్లా అధ్యక్షుడు బేతి సతీష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎనగందుల కొమురయ్య, ఉపాధ్యక్షుడు చల్లగురుగుల రాజు, కోశాధికారి సంగ రంజిత్ కుమార్, సంయుక్త కార్యదర్శి గట్టు ప్రశాంత్, సభ్యులు పెండెం భిక్షపతి, కోల కోటి పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hydera bad-500020. Telang ana. 'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93 @gmail.com.